కనుచూపు మేరా.. కరువే..

● 30లో 19 కరువు మండలాలే.. ● ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం..
● దెబ్బకొట్టిన ఖరీఫ్ ● ప్రభుత్వంపైనే భారమంతా..

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లాలో కనుచూపు మేరా కరువు తాండవిస్తోంది. వేల ఎకరాలు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. చెరువులు, కుంటలు చుక్క నీళ్లు లేకుండా ఆకాశం వైపు నోర్లు తెరిచి చూస్తున్నాయి. వేయి అడుగులకు పైగా వేసిన బోర్లు సైతం నీళ్లు లేక.. బేలచూపులు చూస్తున్నాయి. జిల్లాలో 30 మండలాలు ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో 19 ఉండడం విశేషం. దీనిని బట్టే అన్నమయ్య జిల్లాను కరువు ఏ మేరకు కబలించిందో.? అర్థం చేసుకోవచ్చు. ఎన్నో ఆశలతో ఖరీఫ్ కోసం ఎదురు చూసిన రైతులకు భారీ దెబ్బే పడింది. జిల్లాలో ప్రధానంగా సాగు కావాల్సిన వేరుశనగ, వరి పంటలు సాగు కావాల్సిన విస్తీర్ణం కంటే సగమే సాగయ్యాయి. కొద్దోగొప్పో సాగైన పంటలూ సకాలంలో వానలు లేక ఎండిపోయాయి. కనీసం పెట్టుబడులు కూడా చేతికి రాలేదు. ఈ నేపథ్యంలో 2024 జూన్ నుంచి సెప్టెంబరు వరకు నమోదైన వర్షపాతం, డ్రైస్పెల్‌లను పరిగణలోకి తీసుకున్న జిల్లా యంత్రాంగం పంపిన నివేదికల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం కరువు మండలాలను ప్రకటించింది. వైసీపీ హయాంలో కరువు మండలాలను ప్రకటించినప్పటికీ ప్రభుత్వం నుంచి ప్రజలకు ఎటువంటి సాయం అందించలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జిల్లా రైతాంగం భారమంతా కూటమి ప్రభుత్వంపైనే వేసింది.

19 కరువు మండలాలు

జిల్లాలో 30 మండలాలు ఉన్నాయి. అందులో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో గాలివీడు, చిన్నమండెం, సంబేపల్లె, సుండుపల్లె, వీరబల్లి, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె రామాపురం, తంబళ్లపల్లె, గుర్రంకొండ, కలకడ, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, కురబలకోట, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, మదనపల్లె, నిమ్మనపల్లె ఉన్నాయి. మదనపల్లె డివిజన్ పరిధిలో పెద్దమండ్యం, రామసముద్రం, ములకలచెరువు మండలాలు, రాజంపేట డివిజన్‌లో రాజంపేట, పెనగలూరు, నందలూరు, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, కేవీపల్లె మండలాలు కరువు మండలాల జాబితాలో లేవు. వీటిలోనూ పెద్దమండ్యం, ములకలచెరువు, కేవీపల్లె మండలాల్లోనూ తీవ్ర కరువు పరిస్థితులే ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలను కాకుండా వాస్తవ పరిస్థితులను గమనించి వీటిని కూడా కరువు మండలాలుగా ప్రకటించాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలోని కరువు పరిస్థితులను ఒకసారి గమనిస్తే..


కలకడ మండలంలో దెబ్బతిన్న వేరుశనగ పంట (ఫైల్‌ఫోటో)

పీలేరు నియోజకవర్గంలోని కలకడ మండలంలో సాగునీటి చెరువులు, బావులు ఎండిపోగా వ్యవసాయ బోర్లు అడుగంటాయి. దీంతో మండలంలో సాగు విస్తీర్ణం భారీగా తగ్గింది. ఇక్కడి రైతులు ప్రధానంగా టమోటా, వేరుశనగ, వరి పంటలను సాగు చేస్తారు. అయితే పరిస్థితులు అనుకూలించకపోవడంతో రైతులు పెద్దగా వ్యవసాయం వైపు మొగ్గు చూపలేదు. ఫలితంగా గతానికి భిన్నంగా ఈ ఏడాది వేరుశనగ 816 ఎకరాల్లో, టమోటా 1427 ఎకరాల్లో, వరి 339 ఎకరాల్లో మాత్రమే సాగైంది. అయితే వేరుశనగ పంట ఆశించిన స్థాయిలో దక్కక రైతులు నష్టాలు చవిచూశారు. అలాగే టమోటా విషయంలో పంటకు నీటి తడులు అందక రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇక పాడి రైతులు తమ జీవనాధారమైన పశువులకు మేత లేక ఇబ్బంది పడుతున్నారు. ఇదే పరిస్థితి నియోజకవర్గ వ్యాప్తంగా ఉంది.


కలకడ మండలం గంగాపురం పంచాయతీలో చుక్కనీరు లేని నేరేళ్లకుంట


సుండుపల్లెలో ఎండిపోయిన రాతిచెరువు

కలికిరి మండలంలో ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ దిగుబడుల అంచనా కోసం వ్యవసాయాధికారులు శాస్త్రీయ పద్ధతుల్లో పంట నూర్పిడి చేశారు. ఇటీవల చీకటిపల్లె గ్రామంలోని రైతు శేషారెడ్డి పొలంలో సాగు చేసిన వేరుశనగ పైరును నిర్ణీత విస్తీర్ణంలో పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. సర్వే నెం.201 పొలంలో నిర్ణీత విస్తీర్ణంలో 1200 కిలోల దిగుబడులు నమోదయ్యాయి. అంటే ఎకరాకు 194 కిలోలు అనగా దాదాపుగా 5 బస్తాలు మాత్రం దిగుబడులు వచ్చాయని గుర్తించారు. అదే విధంగా రెండవ ప్రయోగాన్ని అదే గ్రామంలోని సరోజమ్మకు చెందిన 214-9 సర్వే నెంబరులో పరిశీలించగా నిర్ణీత విస్తీర్ణంలో 0.170 కిలోలు (కేవలం 170 గ్రాములు) నమోదు చేశారు. అంటే ఎకరాకు 28 కిలోలు మాత్రమే దిగుబడి వచ్చినట్లు గుర్తించారు.




ప్రభుత్వం ఆదుకోవాలి..

2.5 ఎకరాల్లో టమోటా పంట పెట్టా. రూ.5 లక్షల వరకు ఖర్చు అయ్యింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో అనుకూలంగా వానలు పడలేదు. నీళ్ల లేకపోవడంతో పంటను కాపాడుకోవడం కష్టంగా ఉంది. దీంతో కాయల సైజు, నాణ్యత తగ్గడంతో మార్కెట్లో మంచి రేటు లేక నష్టం వచ్చింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

- సోమినేని శ్రీనివాసులు నాయుడు, బాటవారిపల్లె, కలకడ మండలం

పశువుల మేతకూ కటకటే..



నాకు 20 ఎకరాల పొలం ఉంది. ఈ ఏడాది వర్షాలు లేక.. ఎలాంటి పంటలు పెట్టలేకపోతున్నాం. కనీసం తిండి గింజల కోసం కార్తీకంలో వరి మడి నాటుకోవాలని వరినార్లు పోశాము. నీళ్ల లేక వరి నారు ఎండిపోయింది. పశుమేతకు కూడా కష్టంగా ఉంది. వేయి అడుగుల లోతు బోర్లు వేసినా నీళ్ల పడడం లేదు.

- పాపయ్య, వండాడి, చిన్నమండెం

కరువు మండలంగా ప్రకటించడం సంతోషం..



వర్షాలు లేవు. ఉన్న పింఛా ప్రాజెక్టు తెగిపోయింది. సకాలంలో ప్రాజెక్టు పనులు పూర్తి చేసి ఉంటే కాలువల ద్వారా సాగునీళ్లు వచ్చేవి. భూములు పండితేనే.. కడుపు నిండేది. కూలీ పనులు కూడా పూర్తి స్థాయిలో దొరకడం లేదు. పిల్లల చదువులు, తినడానికి కష్టంగా ఉంది. ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించడం సంతోషం.

- వెంకటరమణ నాయక్, సుండుపల్లె

ఉచిత గ్యాస్ సిలిండరు పథకాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదర్శ రాజేంద్రన్ తదితరులు



దీపావళి కానుకగా 'దీపం-2'

● జిల్లాలో 3.74 లక్షల మందికి లబ్ధి
● రూ.90 కోట్ల మేర సామాజిక పింఛన్ల పంపిణీ
● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటిటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి కానుకగా సీఎం చంద్రబాబు దీపం-2 పథకం కింద సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందజేసి మహిళల జీవితాల్లో నిజమైన వెలుగులు నింపారని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో దీపం-2 పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల అమలులో భాగంగా ఇచ్చిన హామీ మేరకు ఎంతో ప్రతిష్టాత్మకంగా దీపం-2 పథకాన్ని ప్రారంభించారన్నారు. 1999-2000 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు పేద మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారని, ప్రస్తుతం సీఎంగా ఉంటూ దీపం-2 పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఇంటికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారన్నారు. జిల్లాలో 3,74,552 మందికి ఏడాదికి రూ.32 కోట్ల మేర ఉచిత గ్యాస్ సిలిండర్లతో వినియోగదారులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే గ్రామ, వార్డు సచివాలయంలో నమోదు చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లను కలెక్టర్, జేసీ, టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. అలాగే ఉచిత గ్యాస్ సిలిండర్ల వాహనాన్ని జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. కాగా దీపావళి కానుకగా సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం ఎంతో సంతోషానిచ్చిందని, ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కార్యక్రమానికి వచ్చిన సంఘ సభ్యురాళ్లు పద్మజ, షెహతాజ్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఆర్డీవో శ్రీనివాస్, ఐవోసీ సేల్స్ అధికారి ప్రవీణ్‌కుమార్, డీఎస్‌వో రఘురాం, టీడీపీ నాయకుడు రాహుల్‌రెడ్డి, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

1వ తేదీనే వందశాతం పింఛన్ల పంపిణీ

ముఖ్యమంత్రి దృఢ సంకల్పంతో దీపం-2 పథకంతో పాటు నేడు సామాజిక పింఛన్ల రూపంలో వందశాతం పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రతి నెల రూ.90 కోట్ల మేర సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు వారి ఇంటి వద్దనే అందజేస్తున్నామన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఏ రోడ్డుపై కూడా గుంతలు లేకుండా పనులు చేపట్టే కార్యక్రమాన్ని శనివారం రాష్ట్రంలో లాంఛనంగా సీఎం ప్రారంభిస్తుండగా, జిల్లాలోని సంబేపల్లెలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాల్లో విరివిగా పాల్గొని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సెలవులో మదనపల్లె, రాజంపేట సబ్ కలెక్టర్లు

● విదేశీ పర్యటన కోసం 15 రోజులు మంజూరు చేసిన ప్రభుత్వం

కలికిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘ స్వరూప్, వైఖోమ్ నైదియా దేవి సెలవులో వెళ్లారు. ఈ మేరకు శుక్రవారం నుంచి 15వ తేది వరకు ఇరువురికీ సెలవు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. టోక్యో (జపాన్)లో వ్యక్తిగత పర్యటన నిమిత్తం సబ్‌కలెక్టరు దంపతులకు ఈ సెలవు మంజూరైంది. అంతవరకూ రెండు చోట్ల తాత్కాలికంగా ఇన్‌చార్జీల ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టరుకు ప్రభుత్వం సూచించింది. సెలవు పూర్తయిన అనంతరం తిరిగి యథావిధిగా వారిద్దరికీ పోస్టింగులు ఇవ్వాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఇద్దరి సెలవులకు సంబంధించి అక్టోబరు 7న జిల్లా కలెక్టరు పంపిన ప్రతిపాదనల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం

గుర్రంకొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి వేద పండితులు స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా చేశారు. ఈ తంతు తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆనందకేళి.. దీపావళి

● జిల్లా వ్యాప్తంగా సంబరాలు

రాయచోటిటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా గురువారం రాయచోటి పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా సంబరాలు ఆకాశాన్నంటాయి. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ప్రతీ వీధిలో పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా బాణసంచా కాల్చుతూ సంతోషంగా గడిపారు. ముఖ్యంగా యువత పెద్ద శబ్దం వచ్చే, రంగురంగుల కాంతులు విరజిమ్మే టపాసులు కాల్చడంలో తలమునకలయ్యారు. వీధుల్లో ధూం..ధాం అనే శబ్దం తప్ప మరేమీ వినిపించలేదు. మహిళలు మట్టి దివ్వెలలో దీపాలను ఇంటి ముంగిట వరుసలుగా వెలిగించి చీకటిని పారదోలి కొంగ్రొత్త వెలుగులకు స్వాగతం పలికారు. తెల్లవారి లేచింది మొదలు పిల్లలంతా కేరింతలతో సందడి వాతావరణం కనిపించింది. దీపావళి పర్వదినం ఆనందపు కాంతులను విరజిమ్మింది.




రాయచోటిలో టపాసులు కాల్చుతున్న దృశ్యం

ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాలు స్వాధీనం

● 8 టిప్పర్లు, 2 లారీలు, ఎక్సకవేటర్ స్వాధీనం


4
పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక టిప్పర్లు


5

అర్థవంతమైన చర్చ సాగేనా..?

● ప్రజా సమస్యలకు పరిష్కారం చూపేనా..?
● నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం


దేశ భద్రతే ధ్యేయంగా వల్లభాయ్ పటేల్ కృషి

4

జగనన్న కాలనీని అమ్మేశారు

● ఒక్కొక్కరు నాలుగైదు స్థలాలు ఆక్రమణ ● దళారుల నుంచి రూ.లక్షల్లో చేతులు మారిన వైనం ● పొషిజన్ పేరుతో అనర్హులకు పట్టాలు ● ఇచ్చిన వాటిలో నేటికీ పూర్తికాని భవనాలు ఎన్నో

స్లాబు దశలో ఆగిన భవనం



అది మోటకట్ల జగనన్న కాలనీ. మండల కేంద్రంలోని సంబేపల్లె వడ్లపల్లి రోడ్డు అనుకుని ఉంది. ఈ కాలనీలో 183 గృహ నిర్మాణాలకు లేఅవుట్లు వేయగా అందులో 120 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. మిగతావి ఇన్‌ఎలిజిబుల్ కింద పక్కన పెట్టేశారు. ఇదే అదునుగా చేసుకున్న కొందరు రంగప్రవేశం చేసి ఒక్కొక్కరు నాలుగైదు స్థలాలు ఆక్రమించేశారు. వాటిని దళారుల ద్వారా అమ్మేసి నీకింత... నాకింత అని పంచేసుకున్నారు. దీనిపై గతంలో జేసీ తమీమ్ అన్సారియా విచారణ చేపట్టినా.. ఎందుకనో ఆగిపోయింది. ఇదిలా ఉండగా లబ్ధిదారులకు పంపిణీ చేసిన స్థలాల్లో సగానికి పైగా భవనాలు పునాదులు, పిల్లర్ల దశలోనే ఉండడంతో డిసెంబరు నాటికి పూర్తి కావాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా కనిపించడం లేదు.


ఇంటి నిర్మాణం కోసం ఇచ్చిన సిమెంటు గడ్డకట్టిన వైనం


పిల్లర్ల దశలో ఉన్న పెద్ద భవనం


పునాది కట్టి వదిలేసిన స్థలాలు

సంబేపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో పట్టణంలో ఒక సెంటు, పల్లెల్లో ఒకటిన్నర సెంటుతో పట్టాలు పంపిణీ చేసింది. కానీ ఆ స్థలాలు కొండల్లో, గుట్టల్లో ఇవ్వడం.. ఆ ఇచ్చిన వాటిల్లోనూ చాలా వరకు అనర్హులకు పట్టాలు ఇవ్వడంతో జగనన్న కాలనీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఇక పరపతి, పలుకుబడి ఉన్నవారు అయితే ఒక్కొక్కరు నాలుగైదు స్థలాలు ఆక్రమించుకున్నారు. కొందరు ఆ స్థలాల్లో పెద్ద పెద్ద భవంతులు నిర్మించుకోగా, కొందరు ఆ స్థలాలను దళారుల ద్వారా అమ్మేసుకొని అందినకాడికి వెనకేసుకున్నారు. ఈ కోవకు చెందినదే మండలంలోని మోటకట్ల జగనన్న కాలనీ. ఈ కాలనీని మండల కేంద్రంలోని సంబేపల్లె వడ్లపల్లి రోడ్డు అనుకుని లేఅవుట్లు వేశారు. ఈ కాలనీలో 183 గృహ నిర్మాణాలకు లేఅవుట్లు వేయగా అందులో 120 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. మిగతా వాటిని ఇన్‌ఎలిజిబుల్ కింద పక్కన పెట్టేశారు. ఇదే అదునుగా భావించిన ఆక్రమణదారులు రెవెన్యూ సిబ్బంది సాయంతో స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కొక్క గునాదికి రెండు నుంచి మూడు లక్షలకు అమ్మేసి లక్షల్లో చేతులు మార్చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

అనర్హులకు స్థలాలు కేటాయించారు

ఈ కాలనీలో మోటకట్ల గ్రామ ప్రజలు కోసం, నిరుపేదలకు గృహాలు మంజూరు చేసేందుకు స్థలాలు కేటాయించారు. అయితే ఇక్కడ మోటకట్ల గ్రామస్తుల కన్నా ఇతర గ్రామస్తులే అధికంగా ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అర్హులు కాకుండా, అనర్హులే ఇక్కడ స్థలాలు పొందారని పలువురు చెబుతున్నారు. బయట గ్రామస్తులకు అధికారులు ఒక్కొక్కరికి నాలుగైదు స్థలాలు కేటాయించడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదంటున్నారు.

జగనన్న కాలనీల్లో పొజిషన్ సర్టిఫికెట్లు

పేదలకు ఇచ్చిన జగనన్న కాలనీల్లో స్థలాలకు అధికారులు పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేసినట్లు తెలిసింది. సాధారణంగా ఎవరికైనా పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలంటే ఆ స్థలం తమ ఆధీనంలో ఉండాలి. అక్కడ లబ్ధిదారుడు నివాసం ఉండాలి. అటువంటి వారికి మాత్రమే సర్టిఫికెట్ మంజూరు చేయాలి. కానీ అధికారులు ఏం ఆశించి వారికి స్థలాలను కేటాయించారో, వారికి ఏ విధంగా పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చారో అధికారులే చెప్పాలి. డబ్బులు ఎరగా వేసి అధిక సంఖ్యలో సర్టిఫికెట్లు పొందినట్లు సమాచారం.

నేటికీ పూర్తికాని భవనాలు ఎన్నో

ఆ కాలనీలో ఇంకా ఎన్నో గృహాలు వివిధ దశల్లో ఆగిపోయి ఉన్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మన ఇళ్లు మన గౌరవం పేరుతో డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని అధికారులకు చెబుతుంది. అయితే ఈ కాలనీలో చూస్తే డిసెంబరు లోపు పూర్తి చేసే పరిస్థితులు కనిపించడం లేదు. ఇంకా 50 శాతం పైన భవనాలు పూర్తి కావాల్సి ఉంది. పునాది, గునాది, మౌలింగ్ దశలో వివిధ భవనాలు ఉన్నాయి. అర్హులైన వారికి మంజూరు చేసి ఉంటే ప్రతిఒక్కరూ చెప్పిన సమయానికి గృహాలు పూర్తి చేసి ఉండేవారని స్థానికులు అంటున్నారు. అనర్హులకు ఇవ్వడంతో గృహాలు పూర్తి చేయడం లేదని ఆరోపిస్తున్నారు.

స్థలం కోసం ఎన్నిసార్లు తిరిగినా ఇవ్వలేదు..



నాకు ఇంటి స్థలం కేటాయిస్తే ఇల్లు కట్టుకుంటానని ఎన్నిసార్లు అధికారులను అడిగినా ఇవ్వలేదు. సంబేపల్లె గ్రామస్తుడిని అయిన నాకే ఇవ్వలేదు. మండలంలోని ఎక్కడో మారుమూల గ్రామాల్లో ఉన్న అనర్హులకు స్థలాలు కేటాయించారు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి అర్హులైన వారిని గుర్తించాలి. ఆక్రమణలో ఉన్న స్థలాలను స్వాధీనం చేసుకొని తగు న్యాయం చేయాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, బొగ్గులవారిపల్లె

గతంలో కాలనీ ఆక్రమణలపై పరిశీలన

అప్పటిలో మోటకట్ల జగనన్న కాలనీలో ఆక్రమణలపై అప్పటి జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణ చేపట్టారు. ఆక్రమణదారులపై ఆరా తీశారు. దీనిపై నివేదిక పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అయితే రెవెన్యూ అధికారులు ఏం నివేదిక ఇచ్చారో ఏమో కానీ ఇంత వరకు ఎటువంటి చర్యలు లేవు.

వీఆర్వోలతో కమిటీ వేశాం..

నేను కొత్తగా విధుల్లో చేరాను. ఈ విషయం నా దృష్టికి కూడా వచ్చింది. ఈ కాలనీపై వీఆర్వోలతో కమిటీ వేశాను. త్వరలో ప్రతి విషయంపై విచారణ చేపట్టి చట్టపరంగా చర్యలు తీసుకుంటాము.

- వెంకటేశులు, తహసీల్దారు

నయనం రోటరీ ధ్యేయం



● వైద్యుల కృషి... సభ్యుల సేవ.. దాతల సహకారం ● చీకటిని చీల్చే 'నయన'కాంతులు

● ప్రొద్దుటూరు రోటరీ కంటి ఆస్పత్రిలో పేదలకు మెరుగైన సేవలు

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు. కళ్లు లేని జీవితం ముందుకు సాగలేదు. ఎదుటి వ్యక్తులను ఆకట్టుకునేవి కళ్లు. మన ఆలోచనలు, ఆరోగ్యానికి ప్రతిబింబాలు కళ్లు... రంగుల ప్రపంచాన్ని చూస్తూ... కోటి కాంతులను పంచుతూ... కలలను పండించుకోవాల్సిన కళ్లకు కమ్ముకున్న కాలుష్యం, పోషకాహార లేమితో నిర్జీవంగా మారుతున్నాయి. పొడిబారడం, చూపు మందగించడం, శుక్లాలు వంటి సమస్యలకు గురవుతున్నాయి. ఇలాంటి ఎన్నో బాధలను గుర్తించి దాతల దాతృత్వం, ట్రస్టు సభ్యుల సేవ, వైద్యుల కృషితో పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయి. వీటి ఫలితంగా 40 ఏళ్లుగా నిరుపేదలకు నయనాల వెలుగులను ప్రసాదిస్తోంది ప్రొద్దుటూరు రోటరీ కంటి ఆస్పత్రి. వివరాల్లోకెళితే....

కంటి కటకం 35 శాతం ప్రొటీన్‌తోనూ 65 శాతం నీటితో నిండిఉంటుంది. వయసు పెరిగే కొద్దీ ప్రొటీన్ క్షీణిస్తూ ముద్దలుగా తయారవుతుంది. ఐదు పదులు దాటిన సగం మందికి, ఏడు పదులు దాటిన 70 శాతం మందికి కంటి సమస్యలు మొదలవుతాయి. ఫలితంగా క్రమక్రమంగా చూపు మసకబారుతుంది. చూపు పరిధిలో (ఫీల్డ్ ఆఫ్ విజన్) మధ్య ప్రాంతం మసకబారుతుంది. రంగులు యధాతథంగా కన్పించవు. స్పష్టత లోపిస్తుంది. ఇలాంటి సమస్యలన్నీ ప్రజలను పట్టి పీడిస్తుంటోంది. కంటి సమస్య నుంచి బయట పడాలంటే మహానగరాలకు వెళ్లాల్సి వస్తుండేది. అంతేకాకుండా అక్కడ వైద్యానికి అయ్యే ఖర్చు తడిసి మొపడయ్యేది. దీంతో 1985లో ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే కొప్పరపు సుబ్బారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోమిశెట్టి చిన్నసుబ్బరాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త దేవరశెట్టి మోహన్‌రావు, పేదల కోసం రోటరీ సర్వీస్ కాంప్లెక్స్ ట్రస్టును స్థాపించారు. ఇక్కడ అప్పట్లోనే పేదలకు నాణ్యమైన వైద్యం, ఉచితంగా కంటి సేవలు అందించేవారు. ఎంతో మహోన్నతమైన సంకల్పంతో స్థాపించారు. 2004లో సోమిశెట్టి చిన్నసుబ్బరాయుడు అల్లుడు గాథంశెట్టి రామక్రిష్ణ(యూఎస్‌ఏ), మరి కొందరు కలిసి ఈ ఆస్పత్రిని పునరుద్ధరించారు.



శస్త్ర చికిత్సకు ముందు సమస్యను పరిశీలిస్తున్న నిపుణులు



శస్త్ర చికిత్సకు ఉపయోగించే ఆధునిక పరికరం ఫ్యాకోమిషన్

2005 నుంచి తాండవకృష్ణ, ఎంవీఎన్ ప్రభు, కోటా శివకుమార్ సహా మరో 13 మంది ఉచితంగా ఈ ట్రస్టు ద్వారా తమ అమూల్యమైన సేవలను అందిస్తున్నారు. రోటరీ సర్వీస్ కాంప్లెక్స్ ట్రస్టు ద్వారా వందలాది మంది నిరుపేదలు ఉచితంగా కంటి వైద్యం పొందుతున్నారు. వైద్యసేవలు, శస్త్ర చికిత్స, ఉచితంగా ఆహారం, మందులు, కంటి అద్దాలను ఆస్పత్రి సమకూర్చుతుండడంతో పేదల కళ్లల్లో వెలుగులు నిండుతున్నాయి.

ఆధునిక వైద్యసేవలు

రోటరీ కంటి ఆస్పత్రి పరిసరాలు శుభ్రంగా కార్పొరేట్ స్థాయికి దీటుగా ఉన్నాయి. రోటరీ కంటి ఆస్పత్రిలో ముగ్గురు వైద్యులు, 20 మంది సిబ్బంది నిత్యం వైద్యసేవలు అందిస్తున్నారు. 20 పడకల సామర్థ్యం కలిగిన ఈ ఆస్పత్రి పేదలకు ఉచిత వైద్యం అందించడమేకాక ధనవంతులకు తక్కువ ఫీజుతో నాణ్యమైన శస్త్ర చికిత్సను కూడా చేపడుతున్నారు. ఆస్పత్రిలో రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యసేవలు అందుతున్నాయి. ఇందులో అత్యాధునిక వసతులతో కూడిన ఆపరేషన్ థియేటర్, కంటి విభాగానికి సంబంధించిన ఆధునిక పరికరాలైన ఏఆర్ మిషన్, ఎస్కాన్, లాన్సోమీటర్, స్కిట్‌ల్యాంప్, ఫ్యాకో ఎమల్సిఫికేషన్ సర్జరీ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఆధునిక పరికరాలతో శస్త్రచికిత్స, సమర్థవంతమైన వైద్యుల నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి. ప్రతి నెల మొదటి ఆదివారం నంద్యాలకు చెందిన రెటీనా వైద్యుడు డాక్టర్ క్రాంతి ఇక్కడ ఉచితంగా కంటి పరీక్షలు, నిర్ధారణ చికిత్స నిర్వహిస్తున్నారు. అంతేకాక ట్రస్టు ఆధ్వర్యంలో సేవా దృక్పధంతో ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్ విభాగాల వైద్యశిబిరాలను కూడా నిర్వహిస్తున్నారు. ఓపీ విభాగంలో ప్రతినెల సుమారు 3 వేల మంది ఇక్కడ వైద్యసేవలు పొందుతున్నారు. నెలకు సుమారు 300 ఆపరేషన్లు చేస్తున్నారు. శస్త్ర చికిత్స సమయంలో ఉచితంగా రక్త పరీక్షలను ఆస్పత్రిలోనే నిర్వహిస్తున్నారు. వైద్యులు, సిబ్బంది జీత భత్యాలు అందుతుండగా, ట్రస్టు సభ్యులందరూ ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా పేదలకు సేవా భావంతో ఉచిత సేవలు అందిస్తున్నారు.



శస్త్ర చికిత్స అనంతరం రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు చాందినీబేగం

పేదల సేవే పరమావధి



రోటరీ కంటి ఆస్పత్రిలో దాదాపుగా 40 ఏళ్లుగా పేదలకు ఉచిత కంటి వైద్యసేవలు నిర్వహిస్తున్నారు. రేషన్‌కార్డు ఉన్నవారికి ఉచిత వైద్యసేవలు, శస్త్ర చికిత్స, ఉచితంగా ఆహారం, మందులు, కంటి అద్దాలు అందిస్తున్నాం. సభ్యుల సేవాభావం చాలా గొప్పది. నేను 15 ఏళ్లగా ఇక్కడ సేవలను అందిస్తున్నాను. పేదలకు సేవ చేయడమే ట్రస్టు ముఖ్య ఆశయం.

కోటా శివకుమార్, రోటరీ కంటి ఆస్పత్రి ప్రెసిడెంట్, ప్రొద్దుటూరు.

చిరుత దాడిలో దూడ మృతి

- భయభ్రాంతులవుతున్న ప్రజలు



దూడ మృత కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ, పశువైద్య అధికారులు

నిమ్మనపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పొలం వద్ద ఆవుల కోసం వేసుకున్న రేకుల షెడ్డులో వున్న దూడపై చిరుత పులి దాడి చేయడంతో దూడ మృతి చెందింది. చల్లావారిపల్లి బొడికొండ పాడి రైతు ఆదెన్న తన పొలంలో పాడి ఆవుల కోసం రేకుల షెడ్డును వేశాడు. ఇందులో ఆవులను అక్కడే మేపుతూ వుండేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఎప్పటిలాగే పాడి ఆవులకు మేపు వేసి రేకుల షెడ్డులో నిద్రపోయిన ఆయన ఉదయం లేచి చూడగా షెడ్డు ముందు రక్తపు జాడలు కనిపించాయి. అయితే ఆవుల్లో దూడ కనిపించక పోవడంతో చుట్టుపక్కల వెదకగా 20అడుల దూరంలో దూడ రక్తపు మడుగులో చనిపోయి పడివుందని తెలిపాడు. దీంతో అటవీశాఖ, పశువైద్యాధికారులకు సమాచారం ఇవ్వడంతో మదనపల్లి ఆటవీ శాఖ డీఆర్‌ఓ మధుసూదన్, పశువైద్యాధికారి సురేష్, తవళం బీట్ ఎఫ్‌డీఓ దీప, సంఘటనా స్థలంలో దూడ కళేబరాన్ని పరిశీలించారు. చిరుత దాడితోనే దూడ మృతి చెందినట్లు ఆనవాళ్లు వున్నాయని, అటవీ ప్రాతంలో దగ్గరగా వుండడంతో దూడను చంపి అడవిలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసినట్లు డీఆర్‌ఓ భావించారు. చల్లావారిపల్లి, సమీప ప్రజలు అప్రమత్తంగా వుండాలని చిరుతపులి కనిపిస్తే అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. పశువైద్యాధికారి దూడ కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. శుక్రవారం బోడికొండ వద్ద గొర్రెలమందపై చిరుత దాడి చేయగా గట్టిగా కేకలు వేయడంతో చిరుత అక్కడి నుంచి పారిపోయినట్లు గౌనిగారిపల్లి రైతు శంకర తెలిపాడు. చిరుత దాడిలో రెండు గొర్రెలు గాయపడ్డాయి. చిరుత సంచరిస్తోందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌డీఓ దండోరా వేయించారు.

వైన్ లేదని రెచ్చిపోయిన యువకులు

- ములకలచెరువులో మద్యం దుకాణంపై దాడి

- రూ. 50వేలు విలువైన మద్యం బాటిళ్లు ధ్వంసం



దుకాణంలో ధ్వంసమైన మద్యం

ములకలచెరువు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో గుర్తుతెలియని యువకులు రెచ్చిపోయారు. మద్యం దుకాణంలో వైన్ లేదని చెప్పడంతో దాడి చేశారు. రూ.50వేలు విలువైన మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. ఈ విషయమై మద్యం దుకాణం యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.. ములకలచెరువులోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఆర్‌ఆర్ మద్యం దుకాణానికి గురువారం మధ్యాహ్నం గుర్తుతెలియని యువకులు మద్యం కోసం వచ్చారు. వైన్ కావాలని సేల్స్‌మెన్‌ను అడగడంతో లేదని సమాధానం చెప్పాడు. దీంతో ఆగ్రహానికి గురైన యువకులు మద్యం దుకాణంలో ఫర్నీచర్, మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. దీంతో పెద్ద ఎత్తున మద్యం బాటిళ్ళు పగిలిపోయాయి. ఘటన జరిగిన తక్షణం స్పందించిన సీఐ రాజారమేష్, ఎస్‌ఐ గాయత్రి నిందితుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఈ విషయంపై మద్యం దుకాణం యజమాని చాకీ సెంటర్ నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

కోదండరామాలయంలో 'ఆక్టోపస్' మాక్ డ్రిల్



విన్యాసం చేస్తున్న ఆక్టోపస్ సిబ్బంది

ఒంటిమిట్ట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక శక్తులు, టెర్రరిస్టులు దాడులు చేస్తే ఎలా ఎదుర్కోవాలనే అంశంపై కోదండ రామాలయంలో ఆక్టోపస్ పోలీసులు మాక్‌డ్రిల్ చేపట్టారు. ఆలయంలోకి ప్రవేశించిన టెర్రరిస్టులను చుట్టుముట్టి అంతమొందించడం, అనంతరం భక్తులను రక్షించే విధానాన్ని ప్రదర్శించారు. గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్, వైద్య సిబ్బంది అప్రమత్తత, రెవెన్యూ అధికారులు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆక్టోపస్, రెవెన్యూ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రూటా జిల్లా అధ్యక్షుడిగా రెహమాన్



సిబాతుర్ రెహమాన్, అబ్దుల్‌నాదిర్ షావలి,

మదనపల్లె అర్బన్/రాయచోటిటౌన్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): రూటా అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా ఎస్ఎండీ సిబాతుర్ రెహమాన్, జిల్లా కార్యదర్శిగా అబ్దుల్ నాదిర్ షావలిని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, రూటా అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ షేక్. మహమ్మద్ అలీ, పరిశీలకుడు పీఎండీ ఇలియాస్ తెలిపారు. అన్నమయ్య జిల్లా పరిధిలోని మదనపల్లె మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ప్రాంతీయ సదస్సులో ఉర్దూ మీడియం స్కూళ్ల సమస్యలపై చర్చించారు. అనంతరం జిల్లా కార్యవర్గ ఎన్నిక చేపట్టారు. ఎన్నికల అధికారి, పరిశీలకుల సమక్షంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి మరో 16 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రూటా ఫౌండర్, ప్రెసిడెంట్ సయ్యద్ హిదాయతుల్లా, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, రాష్ట్ర సమన్వయకర్త మహమ్మద్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

12 మంది కోడి పందెంరాయుళ్ల అరెస్టు

25 బైకులు స్వాధీనం ● యాభై మంది పరారీ

కలికిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న కోడి పందెంపై కలికిరి పోలీసులు భారీ స్థాయిలో జరిపిన దాడుల్లో 12 మంది పందెంరాయుళ్ళు పట్టుబడ్డారు. వీరితోపాటు 25 బైకులను స్వాధీనం చేసుకోగా మరో యాభై మంది వరకూ పందెంరాయుళ్ళు పారిపోయారు. సంఘటనపై ఇన్‌స్పెక్టర్ కె. రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల్లోకెళితే.... చీకటిపల్లె పంచాయతీ రంగనాథపురం వద్ద శుక్రవారం భారీ స్థాయిలో కోడిపందెం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. కొందరు పందెం జరుగుతున్న తీరును వీడియో తీసి జిల్లా పోలీసు అధికారులకు పంపడంతో స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. అధికారుల ఆదేశాల మేరకు కోడి పందెం జరుగుతున్న ప్రాంతాన్ని పోలీసులు చుట్టుముట్టారు. పోలీసుల రాకను పసిగట్టిన పందెంరాయుళ్ళు దాదాపు యాభై మంది వరకూ పారిపోయారు. మరో 12 మంది పోలీసులకు పట్టుబడ్డారు. వీరితోపాటు 25 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారి నుంచి తొమ్మిది పందెం కోళ్ళు, రూ.19,990ల నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారందరినీ అరెస్టు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలో జూదం, కోడి పందాలు వంటి వాటిని నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

వ్యక్తి ఆత్మహత్య



చంద్ర మృతదేహం

ములకలచెరువు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జీవితం మీద విరక్తి చెంది తోట చంద్ర ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే..... గూడుపల్లె పంచాయతీ కనుగొండవారిపల్లె వాసి తోట చంద్ర ములకలచెరువులోని ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవస్తున్నాడు కొంత కాలంగా భార్య, పిల్లల గురించి పట్టించు కోలేదు. దీంతో భార్య, పిల్లలు దూరంగా ఉన్నారని జీవితంపై విరక్తి చెంది ఇంట్లో కమ్మీకి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై మృతుని భార్య భవాని ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గాయత్రి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఇసుక అక్రమ రవాణా వాహనాలు పట్టివేత

8 టిప్పర్లు, 2 లారీలు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం




వాహనాలను స్వాధీనం చేసుకున్న నందలూరు తహసీల్దారు

ఒంటిమిట్ట/నందలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ఎనిమిది టిప్పర్లు, రెండు లారీలు, ఎక్స్‌కవేటర్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఒంటిమిట్ట చెయ్యేరునది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు టిప్పర్లను ఒంటిమిట్ట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బిల్లులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను స్వాధీనం చేసుకుని, డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు తేలడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివప్రసాద్ వివరించారు.

నందలూరు మండలం కుందా నెల్లూరు సమీపంలోని పాత ఇసుక రీచ్‌లో శుక్రవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు టిప్పర్లు, రెండు లారీలు, ఒక ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దారు అమర్‌నాథ్ పేర్కొన్నారు. అందిన సమాచారం మేరకు నిఘా ఉంచి వాహనాలను పట్టుకున్నామన్నారు. సీజ్ చేసిన వాహనాలు తహసీల్దారు కార్యాలయం వద్ద ఉంచినట్లు తెలిపారు. వీఆర్‌ఓ శివ, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మహిళ మృతిపై విచారణ!

వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆరోపణలు ● విచారణకు ఆదేశించిన కలెక్టర్



ఆస్పత్రిలో విచారిస్తున్న డీఐఓ డాక్టర్ ఉషశ్రీ, తహసీల్దారు భీమేశ్వరరావు

పీలేరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ఆస్పత్రిలో వైద్యం పొందుతూ మహిళ మృతి చెందడం కలకలం రేపింది. వైద్యుల నిర్లక్ష్యంతో ఆమె మృతి చెందిందని ఆరోపణలు వెల్లువెత్తడంతో కలెక్టర్ చామకూరి శ్రీధర్ విచారణకు ఆదేశించారు. దీంతో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉషశ్రీ, పీలేరు తహసీల్దారు భీమేశ్వరరావు, తలుపుల పీహెచ్‌సీ వైద్యాధికారి రమేశ్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. వివరాల్లోకెళితే...

గోరంట్లపల్లె పంచాయతీ కురవపల్లెకు చెందిన లక్ష్మీదేవి(55) తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతుండడంతో బంధువులు బుధవారం ఉదయం ఆమెను ఎస్‌కేఆర్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అప్పటికే ఆమె పరిస్థితి బాగలేకపోవడంతో వైద్యులు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి పేగుల్లో నెలకొన్న అంతర్గత రక్తస్రావం కారణంగా నొప్పి వస్తోందని, గుండె, కిడ్నీల సమస్యలతో ఆమె బాధపడుతోందని నిర్ధారించినట్లు వైద్యులు చెబుతున్నారు. అయితే ఏదైనా పెద్ద ఆస్పత్రులకు వెళ్లాలని సూచిస్తే ఆర్థిక స్తోమతలేదని, ఇక్కడే ఆపరేషన్ చేయాలని కోరడంతో ఆపరేషన్ చేసినట్లు వైద్యులు తెలిపారు. కొద్దిసేపటికి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లెలోని ఓ హృద్రోగ నిపుణుడి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం ఆమె కన్నుమూసింది. దీంతో పీలేరులో జరిగిన వైద్యంలో లోపాలున్నాయని, ఈ కారణంగానే ఆమె చనిపోయిందని ఆరోపిస్తూ బంధువులు మృతదేహంతో ఆస్పత్రి చేరుకున్నారు. పెద్దఎత్తున జనం గూమిగూడడంతో పోలీసులు రంగప్రవేశం చేసి వారికి సర్దిచెప్పారు. జరిగిన సంఘటనపై ఆరా తీశారు. అయితే ఎస్‌కేఆర్ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మహిళ మృతి చెందిందని ప్రజాసంఘాలు, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సంఘటనపై సమగ్ర విచారణ జరిపి తనకు నివేదిక అందజేయాలని కలెక్టర్ జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిని ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఆమె పీలేరు తహసీల్దారు భీమేశ్వరరావు, తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేశ్‌రెడ్డి సమక్షంలో ఆస్పత్రి నిర్వాహకుడు డాక్టర్ వసీంను విచారించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ విచారణ సారాంశాన్ని నివేదిక కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

ఆరోపణలు తగదు

- ఐఎంఏ అధ్యక్షుడు

ఏదైనా సంఘటన జరిగినప్పుడు పూర్వాపరాలు విచారించకుండా కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం బాధిస్తోందని ఐఎంఏ పీలేరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఐఎంఏ సభ్యులతో కలిసి ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సంఘటన జరిగినప్పుడు వైద్యుల వివరణ లేకుండా పోస్టులు పెట్టడం సరికాదన్నారు. మహిళ 'హోలో విస్కస్ పెర్‌ఫోరేషన్, సెప్‌సిస్, సీకేడీ, సీఓపీడీ' వ్యాధులతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చిందన్నారు. ఆ లక్షణాలున్న వారిలో 50 శాతం హైరిస్కు ఉంటుందని తెలిపారు. సమావేశంలో వైద్యులు రాజా సాహెబ్, భారతి, ఈశ్వర సురేంద్ర, శశి, భరత్, వసీం, తదితరులు పాల్గొన్నారు.

'డీడీఆర్‌సీ'ని విజయవంతంగా నిర్వహించాలి

కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు1 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధ న్‌రెడ్డి ఆధ్వర్యంలో 3న నిర్వహించ బోయే డీడీఆర్‌సీ సమావేశాన్ని విజయవంతం చేయాలని అధికా రులను కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంత్రి జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ రివ్యూ కమిటీ సమావేశంపై జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లా అధికారులందరూ శాఖల పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర నివేదికలను తయారు చేసి వెంటనే సీపీఓకి అందజేయాలని ఆదేశించారు. వీటిని జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వివరించేందుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తయారు చేయాలని జాయింట్ కలెక్టర్, సీపీఓను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రేపు జిల్లా అభివృద్ధి సమీక్ష : కలెక్టర్

3న జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. పీజీఆర్‌ఎస్ సమావేశం హాలులో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తారన్నారు. సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్ధన్ రెడ్డి, క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో అమలవు తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమగ్ర నివేదికలు రూపొందించాలని అధికారులందరికీ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు.

దేశ భద్రతే ధ్యేయంగా వల్లభాయ్ పటేల్ కృషి



5కే రన్‌లో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది

రాయచోటిటౌన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): దేశ భద్రత ఐక్యత పట్ల నిస్వార్థంగా కృషి చేసిన వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని రాయచోటి డీఎస్పీ విష్ణుమోహన్ అన్నారు. గురువారం దేశ సమైక్యత దినోత్సవం పురస్కరించుకుని జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ సమైక్యతా దినంగా పరిగణించి యూనిటీ రన్ నిర్వహించారు. పటేల్ విగ్రహానికి నివాళులర్పించి యూనిటీ రన్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఉప ప్రధానిగా, మొట్టమొదటి కేంద్ర హోం మంత్రిగా పటేల్ దేశానికి అంకిత భావంతో సేవలందించారన్నారు. యూనిటీ రన్‌లో ఏఆర్ డీఎస్పీ చిన్నిక్రిష్ణ, ఆర్(అడ్మిన్), రామక్రిష్ణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పెద్దయ్య, లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ - ఒకరు మృతి

గాలివీడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేరాలగుట్ట వద్ద రెండు బైక్‌లు ఢీకొనడంతో సురేంద్ర (42) మృతి చెందగా కదిరి రామకృష్ణ గాయాల పాలయ్యారని పోలీసులు తెలిపారు. ఈతోటివారిపల్లె వాసి రామకృష్ణ బైక్‌పై వెళుతుండగా పేరాలగుట్ట వద్ద పెద్ద మండెం మండలం మట్లివారిపల్లె వాసి సురేంద్ర బైక్‌తో ఢీకొన్నాడు. రామకృష్ణ కాలికి గాయమైంది. తలకు బలమైన గాయమైన సురేంద్ర పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సురేంద్ర మృతి చెందినట్లు తెలిపారు. ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రహదారుల మరమ్మత్తుల కోసం 'మిషన్ పథ్ హోల్ ఫ్రీ'

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఆరు నియోజకవర్గాల్లో దెబ్బతిన్న రహదారుల మరమ్మత్తుల కోసం 'మిషన్ పథ్ హోల్ ఫ్రీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో దెబ్బతిన్న రహదారులను మరమ్మత్తులు చేపట్టేందుకు ప్రభుత్వం మిషన్ పథ్ హోల్ ఫ్రీని నేడు ప్రారంభించనుందని, జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో ముఖ్యమైన రహదారుల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాయచోటి నియోజకవర్గం సంబేపల్లెలో సీకే రోడ్డు నుంచి నరసారెడ్డిపల్లె రహదారిపై దెబ్బతిన్న ప్రదేశాల్లో మరమ్మత్తులు, కోడూరు నియోజకవర్గం పెద్ద ఓరంపాడు నుంచి ఎల్లాయిపల్లి ఆశ్రమం వరకు రహదారిపై మరమ్మతులు, పీలేరు నియోజకవర్గం పొంతలచెరువు నుంచి తిమ్మాపురం రహదారిపైన మరమ్మత్తులు, మదనపల్లె నియోజకవర్గం అనంతపూరు- పలమనేరు నుంచి బొమ్మనచెరువు రోడ్డుపై, రాజంపేట నియోజకవర్గం సీఆర్‌పీ నుంచి తాళ్లపాక వరకు రహదారిపై, తంబళ్లపల్లె నియోజకవర్గం కోటకొండ నుంచి దందువారిపల్లి రహదారిపై మరమ్మతులు మిషన్ పథ్ ఫ్రీ ద్వారా చేయనున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రూ.50వేలు కొట్టు.. బెల్టుషాపు పట్టు

- మద్యం వ్యాపారుల బంపర్ ఆఫర్
- పోటీ పడుతున్న బెల్టుషాపు నిర్వాహకులు
- పల్లెల్లో జోరుగా వెలుస్తున్న బెల్టుషాపులు
- కొరవడిన ఎక్సైజ్, పోలీసుశాఖల నిఘా



బద్వేలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాగినోడికి తాగినంత అన్న ట్లు ఎక్కడ పడితే అక్కడ మద్యం పుల్లుగా దొరుకుతోంది. మద్యం షాపులు దక్కించుకున్న వాళ్లే బెల్టుషాపుల ఏర్పాటుకు తెరలేపారు. రూ.50వేలు ఇవ్వండి.. బెల్టుషాపు పెట్టుకోండి అంటూ బంపర్ ఆఫర్ ఇస్తున్నారు. దీంతో పల్లెల్లో జోరుగా బెల్టుషాపులు వెలుస్తు న్నాయి. కొత్తమద్యం పాలసీ ప్రక్రియ పూర్తయి జిల్లా వ్యాప్తంగా మద్యం షాపులు వెలిశాయి. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభు త్వంలో రకరకాల కొత్త మద్యం బ్రాండ్‌లను విక్రయించారు. సగటు మద్యం ప్రియులు ఎక్కువగా తాగే పాత బ్రాండ్‌లు కనిపించకుండా చేశారు. తెలుగు దేశం ప్రభుత్వం ఏర్పడ్డాక మద్యం పాల సీలో పాత మద్యం బ్రాండ్‌లు అందుబాటులోకి తెచ్చారు. అన్ని రకాల నాణ్యమైన బ్రాండ్‌లను విక్రయిస్తామని ప్రభుత్వం చెబుతూ వచ్చింది. ఆ మేరకు మద్యం షాపుల్లో వివిధ రకాల బ్రాండ్లు దిగాయి. ఇదే అదునుగా టెండర్లలో మద్యం షాపులు దక్కించుకున్న వారు మద్యం విక్రయాలను పెద్ద ఎత్తున విక్రయించి సొమ్ము చేసుకునే పనిలో పడ్డారు. మద్యం షాపుల ఏర్పాటుకు భారీగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చిందని.. ఆ డబ్బులు త్వరగా సంపాదించుకునేందుకు బెల్టుషాపుల ఏర్పాటుకు తెగబడినట్లు తెలుస్తోంది.

ప్రతి మండల కేంద్రంలో షాపులు దక్కించుకున్న వారు ఆ మండలంలోని గ్రామాలలో బెల్టుషాపులు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. బద్వేలు, పోరుమామిళ్ల లాంటి ప్రాంతంలో మద్యం షాపులు దక్కించుకున్న వారు బెల్టుషాపులు పెట్టుకునేందుకు సిండికేట్‌లుగా ఏర్పడి ఊర్లను పంచుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో బెల్టుషాపులు పెట్టుకునే వారు కూడా ఎక్కువయ్యారు. బెల్టుషాపుల ద్వారా లక్షలు సంపాదించే పరిస్థితులు ఉండడంతో పల్లెల్లో బెల్టుషాపులకు పోటీ ఎక్కువైంది. దీంతో బెల్టుషాపు కావాల్సిన వారు 50వేలు చెల్లిస్తే... మందు సరఫరా చేస్తామంటూ మద్యం వ్యాపారులు తెగేసి చెబుతున్నారు. దీనికి బెల్టుషాపు నిర్వాహకులు తగ్గేది లేదంటూ మద్యం షాపులు దక్కించుకున్న వారికి డబ్బులు ముట్టు చెబుతున్నారు. ఈ లెక్కన పల్లె పల్లెకు ఒక బెల్టుషాపు వెలుస్తున్నట్లు సమాచారం.

బద్వేలు నియోజకవర్గ వ్యాప్తంగా 17 మద్యం షాపులు ఏర్పాటయ్యాయి. ఒక్క మద్యం షాపు ద్వారా 10 నుంచి 15 వరకు బెల్టు షాపులు పెట్టే పరిస్థితులు కనపడుతున్నాయి. బెల్టుషాపుల ద్వారానే మద్యంషాపుల యజమానులకు కనీసం అంటే ఆరేడు లక్షలు వసూలయ్యే అవకాశం ఏర్పడింది. మద్యం షాపుతో పాటు బెల్టు షాపులు ఏర్పాటు చేస్తే ఎక్కువ రేట్లకు మద్యం విక్రయించి పెట్టిన పెట్టుబడితో పాటు లక్షలు సంపాదించుకోవచ్చనే ఆలోచనతో మద్యంషాపుల వారు బిజీగా ఉన్నారు. బెల్టుషాపులు ఎక్కువైతే ఇప్పటివరకు ప్రశాంతంగా ఉన్న పల్లె సీమల్లో వివాదాలు, గొడవలు చోటు చేసుకునే పరిస్థితి ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈపరిస్థితులలో బెల్టుషాపుల ఏర్పాటుపై ఎక్సైజ్‌శాఖాధికారులు, పోలీసులు నిఘాపెట్టి చర్యలు తీసుకోవాల్సి అవసరం ఉంది.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

గ్రామాలలో ఎవరైనా బెల్టుషాపులు నిర్వ హిస్తే కఠిన చర్యలు తప్పవు. బెల్టుషా పుల ద్వారా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం. ఇప్ప టికే బెల్టుషాపులపై ప్రత్యేక దృష్టి సారిం చి.. చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా బెల్టుషాపులు ఏర్పాట్లు చేస్తున్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలి.

-సీతారామిరెడ్డి, ఎక్సైజ్ సీఐ, బద్వేలు

బెల్ట్ షాపు నిర్వాహకులకు కౌన్సెలింగ్



బెల్టుషాపు నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ హనుమంతు

కాశినాయన నవంబరు (ఆంధ్రజ్యోతి) 1: నర్సాపురం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఎస్ఐ హనుమంతు పలువురు బెల్టుషాపు నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మండల వ్యాప్తంగా పలుగ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్ముతుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. పట్టుబడిన వారికి ఎస్ఐ కౌనెల్సింగ్ ఇస్తూ.. ఇకపై అక్రమంగా మందు అమ్ముతూ పట్టుబడితే కేసు నమోదు చేసి రూ.లక్ష రూపాయలు జరిమానా విధిస్తామన్నారు. అనంతరం వీరిని తహసీల్దారు వెకంటసుబ్బయ్య వద్ద బైండోవర్ చేశామని తెలిపారు.

377 పరుగుల భారీస్కోర్ సాధించిన అనంతపురం జట్టు



కిరణ్‌కుమార్ (109 పరుగులు), ప్రణధీర్ (79), కౌశిక్ (75)

కడప స్పోర్ట్స్, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ డిస్ట్రిక్ట్ గ్రూప్-బి మల్టీ డే రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా శుక్రవారం విజయనగరం జట్టుపై అనంతపురం జట్టు 377 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇతర మ్యాచ్‌లలో గుంటూరు, శ్రీకాకుళం జట్లు స్వల్ప స్కోర్ల వెనుకంజలో వున్నాయి. వివరాలిలా.... కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం-విజయనగరం జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో తొలుత టాస్‌నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 377 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో కిరణ్‌కుమార్ 109 పరుగులు చేయగా.. ప్రణధీర్ 79, రోహిత్ రాయల్ 57 పరుగులు చేశారు.

కేఓఆర్ఎం మైదానంలో నెల్లూరు-గుంటూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 49 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 39 ఓవర్లలో 1 వికెట్ నష్టపోయి 137 పరుగులు చేసింది. ఇందులో కౌశిక్ 75 పరుగులు చేశారు. అలాగే నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో క్రిష్ణా-శ్రీకాకుళం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన క్రిష్ణా జట్టు బ్యాటింగ్‌కు దిగి 60.1 ఓవర్లలో కేవలం 115 పరుగులకే చేతులెత్తేసింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేసింది. ఇందులో జోగేంద్ర 33 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. దీంతో మరో 13 పరుగుల వెనుకంజలో శ్రీకాకుళం జట్టు నిలిచింది. ఆటకు శనివారం చివరిరోజు

మైలవరానికి 9వేలక్యూసెక్కులు విడుదల

కొండాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి శుక్రవారం 9వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తునట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టులోకి అవుకు రిజర్వాయిర్ నుంచి జీఎన్ఎస్ఎస్ వరద కాలువ ద్వారా 9000 క్యూసెక్కుల కృష్ణాజలాలు వచ్చి చేరుతు న్నాయన్నారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.02 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ తెలిపారు.

విద్యార్థులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు

కడప క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగేలా పోలీసు అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నగరంలోని చౌడేశ్వరి స్కూలు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థి దశ నుండే క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదిగేలా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని యాంటి హ్యూమన్‌ట్రాఫికింగ్ ఎస్ఐ శాంతమ్మ విద్యార్థులకు సూచించారు.

4 నుంచి బీఈడి సెమిస్టరు పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలో బీఈడి కళాశాలల 2, 4 సెమిస్టర్ల విద్యార్థులకు ఈ నెల 4 నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు క్రిష్ణరావు తెలిపారు. ఈ పరీక్షల కోసం జిల్లావ్యాప్తంగా 16 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే 16900 మంది విద్యార్థులు హాజరవుతున్నారని అన్నారు. పరీక్షల నిర్వహణకు వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ మార్గదర్శకం మేరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల నిర్వహణకు అబ్జర్వర్లతో పాటు హైపవర్ కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్లను చదువుతున్న కళాశాలల నుంచి పొందాలన్నారు. విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్షలు రాసేందుకు చూడాలని ప్రిన్సిపల్‌కు సూచించారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



పులివెందుల టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల పట్టణంలోని శ్రీనివాస హాల్ థియేటరు సమీపంలోని తమ ఇంట్లో నవ్యశ్రీ (21) అనే వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బంధువుల కథనం మేరకు.. పులివెందుల పట్టణం శ్రీనివాస థియేటరు సమీపంలో నివశిస్తున్న మహేశ్‌కుమార్ అనే వ్యక్తి స్టేట్‌బ్యాంకులో అటెండరుగా విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి సత్యసాయి జిల్లా తలుపులకు చెందిన నవ్యశ్రీతో దాదాపు 16 నెలల కిందట వివాహమైంది. మహేశ్‌కుమార్ ఉద్యోగానికి వెళ్లడంతో ఎవరూ లేని సమయం చూసి నవ్య చీరతో ఉరి వేసుకుని మృతి చెందింది. మధ్యాహ్నం భోజనానికి వచ్చిన మహేశ్ ఎంత సేపు తలుపు తట్టినా డోరు తీయకపోవడంతో ఇతరుల సాయంతో తలుపులు పగలగొట్టి ఇంట్లో ప్రవేశించాడు. అయితే అప్పటికే నవ్యశ్రీ ఉరి వేసుకుని మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషం తెలుసుకున్న ఎస్ఐ నారాయణ సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నవ్యశ్రీ మృతికి కుటుంబ కలహాలా లేక మరేమైనా కారణమా అనేది విచారణలో తేలాల్సి ఉంది.

ఆర్టీసీ బస్సు ఢీ - పలువురికి గాయాలు



ఘటనా స్థలంలో గాయపడినవారు

జమ్మలమడుగు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామ సమీపాన గురువారం ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొన డంతో పలువురికి గాయాలయ్యాయి. వివరాలిలా.. నొస్సం గ్రామం నుంచి ప్రయాణికులతో ఆటో జమ్మలమడుగు వస్తుండగా.. ఆళ్లగడ్డ నుంచి జమ్మలమడుగు వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుకవైపు నుంచి ఢీకొంది. దీంతో పెద్దముడియం మండలం కల్వటాల గ్రామానికి చెందిన హుస్సేన్‌సాహెబ్ అనే వ్యక్తికి కుడిచెయ్యి, కుడికాలుకు రక్తగాయాలయ్యాయి. అలాగే వెంకటసుబ్బమ్మ, నాగలక్ష్మి, సుబ్బలక్ష్మి, తదితరులు గాయపడ్డారు. వీరిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన హుస్సేన్‌సాహెబ్‌ను మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్ లీకై గాయపడ్డ వ్యక్తి మృతి

పెండ్లిమర్రి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండూరు హరిజనవాడకు చెందిన వేంపల్లె వరపుత్రుడు గత శుక్రవారం ఇంటి వద్ద గ్యాస్ సిలిండర్ లీకేజీ కావడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్త కడప రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

మూడు గడ్డివాములు దగ్ధం

పోరుమామిళ్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని మూల వీధిలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. టి.పద్మావతి, వరదరాజుల రత్తమ్మ, ముద్దేటి రమణయ్య అనే రైతులు పశువుల మేతకు నిల్వ ఉంచుకున్న గడ్డి వాములు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక కేంద్రం అధికా రులు మంటలు అదుపు చేశారు. అయితే అప్పటికే గడ్డివాములు కాలిపోయి రూ.50వేలు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

అర్థవంతమైన చర్చ సాగేనా..?

- ప్రజా సమస్యలకు పరిష్కారం చూపేనా..?
- నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం



కడప రూరల్, నవంబరు 1 (అంధ్రజ్యోతి): జిల్లా పరిషత్(జడ్పీ) స్థాయి సంఘాల సమావేశాన్ని శనివారం జడ్పీలో నిర్వహించను న్నారు. ఇప్పటికి దాదాపు 13 సమావేశాలు నిర్వహించినప్పటికీ ఏనాడూ ఆయా శాఖల పనితీరుపై అర్థవంతమైన చర్చ కొనసాగించలేదు. ఆయా కమిటీల చైర్మన్లు, సభ్యులు మొక్కుబడి సమావేశాలతోనే సరిపుచ్చుతున్నారు. వెరసి సమావేశాల పేరుతో అయ్యే ఖర్చు లు మాత్రం తడిపి మోపెడవుతున్నాయి. ప్రణాళిక అండ్ ఆర్థికం, గ్రామీణాభివృద్ధి, విద్య మరియు వైద్యసేవలు, నిర్మాణపు పనులు, స్త్రీ సంక్షేమం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమ స్థాయి సంఘ సమావేశాలను నిర్వహించనున్నారు. 2024 ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ పంటలు దెబ్బతినడంతో రైతులు కష్టాలలో కొట్టుమిట్టాడుతున్నారు. పంటనష్ట పరిహారం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా అందడంలో జాప్యం జరుగుతోంది.

రబీలో అదునులో వర్షాలు పడినప్పటికీ పంటసాగుకు తగిన రుణాలు అందక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతినడంతో వాటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు హల్‌చల్ చేస్తున్నాయి. గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి. జిల్లాలోని ఆయా గ్రామాలలో కనీస శుభ్రతలేదు. ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనమిస్తోంది. పారిశుధ్యపు పనులు సక్రమంగా సాగడం లేదు. విషజ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఆసుపత్రుల్లో తగిన మందుల్లేక నానా యాతన పడుతున్నారు. గ్రామీణ మంచినీటి సరఫరా పథకం నత్తనడకన సాగుతోంది. ఇక నిరుపేదల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ఏర్పాటు చేసిన ఉపాధి హామీపథకం ద్వారా జిల్లాలో జరుగుతున్న పనుల్లో పురోగతి కనిపించడం లేదు. ఇదివరకు చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలోని వసతి గృహాల పనితీరు సక్రమంగా లేదు. తాగునీరు, ఇతర మౌలిక వసతులు లేక విద్యార్థులు అల్లాడుతున్నారు. సమగ్ర శిశు అభివృద్ధి పథకం ద్వారా జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల ద్వారా గ్రామ స్థాయిలో నడుస్తున్న పలు అంగన్‌వాడీలు అద్దెభవనాలలో కొనసాగుతున్నాయి. వీటిలో మౌలిక సదుపాయాలైన తాగునీరు, మరుగుదొడ్లు ఇతరత్రా సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదు. పీహెచ్‌సీ కేంద్రాలలో మౌలిక వసతుల లేమి, సిబ్బంది కొరత వేధిస్తోంది. వీటన్నింటిపై సమీక్ష నిర్వహించి ప్రజలకు న్యాయం చేయాల్సిన గురుతర బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉంది. కానీ ఈ దిశగా స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించడం లేదు. శనివారం నిర్వహించే సమావేశమైనా పూర్తిస్థాయిలో చేపట్టి సమస్యలపై చర్చించి తగు పరిష్కారం చూపుతారని ప్రజలు భావిస్తున్నారు.

నా భర్త.. నాకు కావాలి

- భర్త ఇంటి వద్ద యువతి ఆందోళన
- పోలీసు స్టేషన్‌కు చేరిన పంచాయితీ



గురునాథం, అంకాళమ్మ పెళ్లి నాటి ఫొటో, గురునాథం ఇంటి వద్ద యువతి ఆందోళన

వేంపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా ప్రేమించుకున్నారు. ఓ గుడిలో పెళ్లి చేసుకున్నారు. అబ్బాయి తరపు తల్లిదండ్రులకు ఇష్టం లేకపోవడంతో వివాదం తలెత్తింది. దీంతో నా భర్త నాకు కావాలంటూ వారి ఇంటి ముందు అమ్మాయి ధర్నా చేయడంతో ఘర్షణకు దారితీసింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరంది. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అందిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. పూర్తి వివరాలిలా.. వేంపల్లెకు చెందిన పసుపులేటి గురునాథం, అలవలపాడు గ్రామానికి చెందిన అంకాళమ్మ కొప్పర్తి పారిశ్రామికవాడలోని ఓ కంపెనీలో పనిచేసే వారు. ఈ నేపథ్యంలో వీరు ప్రేమలో పడ్డారు. ఆరు సంవత్సరాలు ప్రేమించుకున్నారు. వారం రోజుల క్రితం తల్లిదండ్రులకు తెలియకుండా బద్వేల్ దగ్గర శివాలయంలో వివాహం చేసుకున్నారు. అనంతరం అలవలపాడులోని యువతి ఇంటికి వచ్చారు. మూడు రోజుల క్రితం ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన గురునాథం తిరిగి రాకపోవడంతో అంకాళమ్మ వేంపల్లెలోని గౌరీనగర్‌లో ఉన్న గురునాథం ఇంటి తమ బంధువులతో కలసి వెళ్లి ఆందోళనకు దిగింది. నన్ను పెళ్లి చేసుకున్నాడు, నా భర్త నాకు కావాలంటూ ధర్నాకు దిగింది. దీంతో అక్కడున్న అబ్బాయి తరపువారితో ఘర్షణకు దిగారు. ఈ విషయం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకోవడంతో పంచాయతీ పోలీసు స్టేషన్‌కు చేరింది. కాగా ఆ యువతి నన్ను పెళ్లిచేసుకున్నాడు, వారి తల్లిదండ్రుల ఒత్తిడితోనే నా భర్త వద్దకు రాలేదంటూ తెలిపింది. అయితే ఈ సమస్య కొలిక్కి రాలేదు, పంచాయితీ కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అందితే చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

మహిళ అదృశ్యం



కడప క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నాగరాజుపేటలో ఓ మహిళ అదృశ్యమైనట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాధరెడ్డి తెలిపారు. కమలాపురం మండలం చదిపిరాళ్ల గ్రామానికి చెందిన కొర్రపాటి శ్రీమంతి (29) గత కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడు తూ ఉండేది. అక్టోబరు 10వ తేదీ కడప నాగరాజుపేటకు వచ్చిన ఆమె తిరిగి ఇంటికి పోకపోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. మహిళా ఆచూకీ తెలిసిన వారు 9121100510, 9121100511కు సమాచారం అందించాలని కోరారు.

సర్పంచ్ మృతి

వల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దుగ్గాయపల్లె సర్పంచ్ పాశం పెద్దక్క మృతి చెందింది. దుగ్గాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని పాపాఘ్నినగర్‌కు చెందిన ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. గురువారం ఆమె నివాసంలో మృతి చెందింది. సమాచారం అందుకున్న వైసీపీ మండల కన్వీనరు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు అబ్బిరెడ్డి వీరారెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సుబ్బారెడ్డి, వైసీపీ నేతలు తదితరులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వృషభాచలేశ్వరా...ఏమిటీ దుస్థితి

- పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిన పుష్కరిణి



పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో అధ్వానంగా ఉన్న వృషభాచలేశ్వరస్వామి పుష్కరిణి

వేంపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయల స్థిర చరాస్తులు కలిగిన వేంపల్లె పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన వృషభాచలేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన పుష్కరిణి దయనీయ పరిస్థితిలో ఉంది. వేంపల్లె పట్టణంలోని మఠం వీధిలో పూర్వం నుంచి పుష్కరిణి ఉండేది. ఇక్కడ నీట మునిగి, అవతలి ఒడ్డున ఉన్న స్వామి వద్దకెళ్లి పూర్వం పూజలు చేసేవారు. కాల క్రమంలో శిథిలావస్థకు చేరుకోగా ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పుష్కరిణికి నిధులు కేటాయించి శిథిలావస్థలో ఉన్న దానిని సక్రమంగా నిర్మించారు. కార్తీకమాసంలో నదుల్లో నీళ్ల లేని సమయంలో ఇక్కడ గౌరీదేవి నిమజ్జనం చేసేవారు. ఇలా పవిత్రంగా ఉండాల్సిన పుష్కరిణి ప్రస్తుతం అధ్వానంగా తయారైంది.

దుర్గంధంలో పుష్కరిణి

పుష్కరిణి చూసిన ప్రజలు ఇదేమిటీ స్వామి ఇంత అధ్వానంగా ఉంచారంటూ ఆవేదన చెందుతున్నారు. పుష్కరిణి పిచ్చిమొక్కలతో నిండి మురికి కూపంలా తయారైంది. చెత్తాచెదారాంతో పాటు ప్యాకెట్లు ఒక్కచోటకు చేరి కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లు తోంది. ఇక పుష్కరిణి లోపలికి వెళ్లే ద్వారం వద్ద ఉన్న గేటు విరిగిపోయి ఉంది. ఎవరుపడితే వారు లోపలికి వెళ్లి మద్యం సేవిస్తున్నట్లు అక్కడి పరిస్థితిని బట్టి అర్థమవుతోంది. దీనిపై ఆలయ అధికారులు, సిబ్బంది దృష్టి సారించి పుష్కరిణి శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



ముఖద్వారం విరిగిపడి ఉన్న దృశ్యం

పింఛా నదికి నీరు విడుదల

సుండుపల్లె, నవంబరు1(ఆంధ్రజ్యోతి): పింఛా నదిలోకి ప్రాజెక్టు నుంచి 300 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్రనాయక్ శుక్రవారం తెలిపారు. సాయంత్రం 6 గంటల సమయంలో ప్రాజెక్టు గేటు ఎత్తి నీటిని విడుదల చేశామన్నారు. కుడికాలువ తూము ఏర్పాటు కోసం నీటిని విడుదల చేయాల్సి వచ్చిందన్నారు. ప్రాజెక్టు దిగువ భాగంలో నదిలోకి ప్రజలు ఎవరూ వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలను అప్రమత్తం చేశారు. కుడికాలువ గేటు ఏర్పాటుకు పనులు ప్రారంభమయ్యాయని, రెండు రోజుల్లో పూర్తవుతాయని తెలియజేశారు.

ఉద్యాన ఉద్యోగుల అసోసియేషన్ కార్యవర్గంలో శ్రీకాంత్



లక్కిరెడ్డిపల్లె నవంబరు (ఆంధ్రజ్యోతి): ఏపీ గ్రామ ఉద్యాన ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా వీరబల్లి శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ ఫణీంద్ర తెలిపారు. గ్రామ ఉద్యాన ఉద్యోగుల సమస్యల కోసం పోరాటం చేస్తా నని శ్రీకాంత్ తెలిపారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

పెనగలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డీఈవో సుబ్రమణ్యంను కోరినట్లు ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ పిల్లి రామకృష్ణ తెలిపారు. విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో వలంటీర్లను నియమించాలని కోరినట్లు ఆయన తెలిపారు.

అధికారుల ఆధ్వర్యంలో 'దీపం' పంపిణీ!

- హడావుడిగా వేదిక మార్పు
- టీడీపీ ప్రధాన నేతలు గైర్హాజరు

రాజంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అధికార పార్టీకి చెందిన స్థానిక నేతల్లో నెలకొన్న విభేదాల నేపథ్యంలో శుక్రవారం నిర్వహించిన దీపం కనెక్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పటిష్ట బందోబస్తు మధ్య నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం దీపం కనెక్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రహ్మణ్యంతోపాటు జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజును ఆహ్వానించారు. హఠాత్తుగా కార్యక్రమ వేదికను ఓ ప్రైవేటు కల్యాణ మండపానికి మార్చారు. జిల్లా స్థాయి అధికారులు, నాయకులు ఎవరూ లేకుండానే డీఎస్పీ సుధాకర్, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, ఇన్‌చార్జి తహసీల్దారు లవణ్ కుమార్, తహసీల్దారు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, ఆర్ఐ శేషంరాజు కార్యక్రమాన్ని ప్రారంభించి మమ అనిపించారు. గతంలో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పడిన వివాదాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నేతల ఆహ్వానాలపై ఇన్‌చార్జి తహసీల్దారు లవణ్‌కుమార్, తహసీల్దారు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామిని ప్రశ్నించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.



రాజంపేట: దీపం కనెక్షన్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ, మున్సిపల్ కమిషనర్ ఇతర అధికారులు



రైల్వేకోడూరు: గ్యాస్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానంద రెడ్డి

పేదల సంక్షేమమే కూటమి ధ్యేయం

రైల్వేకోడూరు: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రైల్వేకోడూరు జనసేన పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానంద రెడ్డి తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ హామీలన్నీ నెరవేస్తారని తెలిపారు. ప్రతిపక్షాలు చెబుతున్న అబద్దాలను నమ్మరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ చాంద్, ఎంపీడీవో నాగార్జునరావు, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, టీడీపీ నేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగరాజు రవికుమార్‌రాజు, ఓబులవారిపల్లె మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రాజు, టీడీపీ నాయకులు గుండయ్యనాయుడు, నార్జాల హేమరాజ్, పోతురాజు నవీన్ పాల్గొన్నారు.

సుండుపల్లె: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట నిలబెట్టుకున్నారని కూటమి నాయకులు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో గ్యాస్ పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు మేకల మహబూబ్‌బాషా, దామోదర్ నాయుడు, చెన్నంశెట్టి వెంకట్రమణ, జనసేన నాయకులు రామాశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమగ్రతకు పటేల్ నిస్వార్థ సేవలు

రాజంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భారత దేశాన్ని బలమైన శక్తిగా తయారు చేయడంలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ పాత్ర మరువలేనిదని జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు సురేస్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, రాష్ట్ర మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షుడు షబ్బీర్‌అహ్మద్, జిల్లా కార్యదర్శి నరేంద్రరాజు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సునీత నారాయణ వర్మ, రాష్ట్ర నాయకులు సుబ్బరాయుడు, నాయకులు హిమగిరియాదవ్, ప్రసాద్‌రెడ్డి, తోట రామయ్య, రాష్ట్ర ఎస్సీ మోర్చ నాయకులు రమణయ్య, హరిప్రసాద్, కృష్ణయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీడీపీవో రాజేశ్వరి మాట్లాడుతూ భారతదేశ భూభాగంలోని స్వదేశీ సంస్థానాలను విలీనం చేసి దేశ సమైక్యతను కాపాడిన ధీరుడు సర్దార్ వల్లభాయ్‌పటేల్ అని కొనియాడారు. అనంతరం ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేశారు. వసుంధరమ్మ, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఆపస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంజనేయప్రసాదు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి బాలరాజు, గౌరవ సలహాదారు రాధాకృష్ణయ్య, జిల్లా మీడియా ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, మండల గౌరవాధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా సేవా ప్రముఖ్ మల్లయ్య, నాయకులు సుబ్బారెడ్డి, సాయిచరణ్‌యాదవ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ వల్లభాయ్‌పటేల్‌కు నివాళులర్పిస్తున్న సాయిలోకేష్, రమేష్‌నాయుడు, బీజేపీ నాయకులు



చిట్వేలి: నివాళులర్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

జాబ్‌మేళాలో 28 మందికి ఉద్యోగాలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

రాయచోటిటౌన్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసు సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో ముత్తూట్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, యంగ్ ఇండియా, టీవీఎస్ ఐడియా లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొన్నారు. 98 మంది అభ్యర్థులు హాజరు కాగా, 26 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. ఎంపికైన అభ్యర్థులను పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివశంకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నాగార్జున, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దేనప్ప, స్కిల్ డెవలప్‌మెంట్ ప్లేస్మెంట్ ఆఫీసర్ వెంకటేశ్, ఏపీఎస్ డీసీ ఆఫీసర్ శ్రీనివాస్, సీడప్ స్టాఫ్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కౌశల్-2024 పోస్టర్ల ఆవిష్కరణ

రాయచోటిటౌన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కౌశల్ పోస్టర్లను శుక్రవారం అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కౌశల్ కోఆర్డినేటర్ మధుమతి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, విషయ, విశ్లేషణ, భారతీయ విజ్ఞాన శాస్త్రం పట్ల నిబద్ధత పెంచే దిశగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు 8, 9, 10 నుంచి ముగ్గురు చొప్పున విద్యార్థులు, పోస్టర్‌కి 8వ తరగతి నుంచి ఇద్దరు, 9 తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులు నమోదు చేసుకోవడానికి అర్హులన్నారు. పై నాలుగు పోటీలకు పాఠశాల, జిల్లా స్థాయిల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కౌశల్ రాష్ట్ర అకడమిక్ టీం మెంబర్ ఆంజనేయులు, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహులు, జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి, జిల్లా కౌశల్ జాయింట్ కోఆర్డినేటర్ కవిత, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, బలరాం తదితరులు పాల్గొన్నారు.

3న షూటింగ్ బాల్ జిల్లా ఎంపికలు

రామాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాల మైదానంలో ఈ నెల 3వ తేదీన షూటింగ్ బాల్ జిల్లా బాలుర జట్టును ఎంపిక చేయనున్నట్లు ఉమ్మడి జిల్లా వైఎస్ఆర్ కడప షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి అనిల్‌కుమార్ తెలిపారు. సెలెక్షన్లకు వచ్చేవారు, ఆధార్‌కార్డు తీసుకొని రావాలని వివరించారు. మరిన్నివివరాలకు 9391835714 ఈ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

దీపం పథకానికి 8 వేల మంది అర్హులు

పెనగలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఇండేన్ ప్రగతి గ్యాస్ ఏజెన్సీల్లో 8,189 మంది లబ్దిదారులు దీపం పథకానికి అర్హులని ప్రభుత్వం గుర్తించినట్లు నిర్వాహకురాలు రాజమ్మ తెలిపారు. మండల వ్యాప్తంగా 11 వేలు పైచిలుకు గ్యాస్ కనెక్షన్లుండగా ఉచితంగా మూడు సిలిండర్లు తీసుకునేందుకు 8 వేల కుటుంబాలను అర్హులుగా గుర్తించి జాబితాను గ్యాస్ ఏజెన్సీకి పంపినట్లు ఆమె తెలిపారు.

శివాలయంలో ఆకాశదీపం ఏర్పాటు

పుల్లంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీపర్వతవర్ధిని శాంతి లింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక శుద్ధ పాడ్యమి సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఆకాశ దీపాన్ని వెలిగించారు. శివపార్వతి విద్యాసంస్థల కరస్పాండెంట్ సోము బాలాజీ, బాబు దంపతులు ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆకాశ దీపాన్ని వెలిగించారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి

వీరబల్లి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): వంగిమళ్ల గ్రామ పంచాయతీ లో నిధుల దుర్వినియోగంపై విచారణ చేయాలని ఆ గ్రామ టీడీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, మల్లికార్జున శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామ పరిధిలో అభివృద్ధి పేరుతో పనులను చేయకుండానే పనులు చేసినట్లు అధికారుల సహకారంతో బిల్లులు చేసుకొని స్వాహా చేశారని ఆరోపించారు. అధికారులు స్పందించి సమగ్ర విచారణ చేస్తే నిజానిజాలు బయటపడతాయన్నారు.

అంగన్వాడీ సెంటర్ మూత

సిద్దవటం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం పంచాయతీ మహబూబ్‌నగర్‌లోని అంగన్వాడీ సెంటర్ శుక్రవారం మూత పడడంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అంగన్వాడీ సూపర్‌వైజర్ శ్రీవిద్యను ప్రశ్నించగా ఈ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న టీచర్ లక్ష్మీప్రసన్న కడపకు వెళ్లిందని, మధ్యాహ్నం నుంచి అంగన్వాడీ కేంద్రం పిల్లలకు అందుబాటులోకి వస్తుందని, ఇకమీదట ఇలాంటి సమస్యలు రాకుండా చూసుకుంటామని తెలిపారు.

పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ

సిద్దవటం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం మండల పరిదిలోని 18 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం పింఛను పంపిణీ చేసినట్లు మండల టీడీపీ మాజీ కన్వీనర్ మామిడి సుబ్బారెడ్డి తెలిపారు. తెల్లవారు జాము నుంచి గ్రామ సచివాలయాల సిబ్బందితో కలసి పింఛన్లు పంపిణీ చేసినట్లు వివరించారు. పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య రాజంపేట అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు : మండలంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి 9 గంటల వరకు పింఛన్లు నిర్విరామంగా పంపిణీ చేశారు. అప్పటి నుంచి సర్వర్ నెమ్మదించడంతో సాయంత్రం వరకు పంపిణీ కొనసాగింది. 98 శాతం పింఛన్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో విజయరావు తెలిపారు.

ముళ్ల పొదల తొలగింపు

సిద్దవటం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రహదారులకు అడ్డంగా ఉన్న ముళ్ల పొదలు, చెత్తను శుక్రవారం తొలగించినట్లు సిద్దవటం గ్రామ సర్పంచ్ భవనాసి నాగరాణి తెలిపారు. ఎగువపేట, బ్రాహ్మణవీధి, ఆంజనేయస్వామి గుడికి వెళ్లే రహదారి తదితర ప్రాంతాల్లో పనులు చేశామని, మరో రెండు రోజులపాటు పనులు కొనసాగుతాయని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పంచాయతీల అభివృద్ధికి నిధులు సమకూరుస్తూ అభివృద్ధికి నాంది పలికారన్నారు. అందువల్లే పనులు చేయడం సాధ్యమవుతోందన్నారు. గ్రీన్ అంబాసిడర్ వాహనంలో పొడిచెత్త, తడిచెత్త వేసి గ్రామాన్ని పరిశుభ్రంగా పెట్టుకోవాలని ఆమె సూచించారు.

తుఫాన్ బాధితులకు పరిహారం

రైల్వేకోడూరు, నవంబరు 1:(ఆంధ్రజ్యోతి) ఇటీవల కురిసిన తుఫాన్ కారణంగా ఇళ్లు కోల్పోయిన వారికి శుక్రవారం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ నిదియాదేవి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సమక్షంలో పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిట్వేలి మండలంలోని మిట్టపల్లె దళితవాడ కు చెందిన కొప్పల సుబ్బలక్షుమ్మ, రైల్వేకోడూరు పట్టణం రాంనగర్‌కు చెందిన ఆత్మకూరు అరుణ, చియ్యవరం గంగెద్దులమిట్ట గిరిజకాలనీకి చెందిన వడవంజి మల్లేశ్వరి, అనంతరాజుపేట ఇందిరానగర్ గిరిజన కాలనీ చెందిన మోట ఆదెమ్మకు రూ. 40వేలు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం పేదల పక్షంలో ఉంటుందని తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఓబులవారిపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముక్కావారిపల్లెలో శుక్రవారం ముగ్గురికి ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ఇన్ చార్జి ముక్కా రూపానందరెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్ నాయకులు

రైల్వేకోడూరు, నవంబరు 1:(ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రైల్వే కోడూరులో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ వి206ఏ కేబినెట్ కార్యదర్శి పెంద్యాల విజయ్‌కుమార్, రీజనల్ చైర్మన్ పొన్నూరు నిరంజన్‌బాబు, రీజనల్ కార్యదర్శి వేమా వెంకట కిషోర్ బాబు, కోడూరు వాసవీ క్లబ్ అధ్యక్షుడు తిరునామాల కుమార్, కార్యదర్శి తిరునామాల సత్యనారాయణ, కోశాధికారి కలువా సోమశేఖర్, వనిత క్లబ్ అధ్యక్షురాలు వేమా మంజుల, కార్యదర్శి గర్రె విజయలక్ష్మి, సభ్యులు గర్రె నరసయ్య, గర్రె మల్లికార్జున, గర్రె సత్యం, కర్నాటి వెంకట సుబ్రహ్మణ్యం, పెసల తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

రైల్వేకోడూరు, నవంబరు 1: (ఆంధ్రజ్యోతి) ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాకృష్ణయ్య ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ కార్మికుల పక్షాన నిలిచి పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీ యూసీ నాయకులు మాదరాజు గంగాధర్, పోకూరి మురళి, సరోజనమ్మ, పలు రంగాల కార్మికులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: మంగంపేటలోని ఏపీ ఎండీసీ పరిసర ప్రాంతాల్లో ఏఐటీయ్ యూసీ 105వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక నాయకులను ఏపీఎండీసీ కార్మికులను సన్మానించారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పోకూరి మురళి అధ్యక్షతన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు



సూరకవాండ్లపల్లెలో టీడీపీ సభ్యత్వాలు నమోదు చేయిస్తున్న ప్రదీప్‌కుమార్‌రెడ్డి

రామాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ సూరకవాండ్లపల్లెలో శుక్రవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి ప్రదీప్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందే రెండు సంవత్సరాల పాటు సభ్యత్వంతో పాటు 5 లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు.

ఓబులవారిపల్లె: మండలంలోని చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీలోని జ్ఞానంపల్లె, గొల్లపల్లె, కమ్మపల్లె, దిగువపల్లె, క్రాస్‌రోడ్డు దతితర ప్రాంతాల్లో టీడీపీ నాయకులు పయ్యావుల కోటేశ్వరరావు, నాగేంద్రనాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవీంద్రనాయుడు ఇంటింటికి తిరిగి సభ్యత్వాలు నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అభిమానులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

3న యూటీఎఫ్ జిల్లా మహాసభలు

నందలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 3న మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ నాయకులు షేక్ రౌఫ్‌బాషా, కె.రమేష్, ఎం. హరినాథ్, జి.కృపానందం, వై.మస్తాన్‌రెడ్డి, వి.సుధాకర్ తెలిపారు. శుక్రవారం నందలూరు హైస్కూల్లో ఏర్పాటు చేసిన మహాసభల సన్నాహక సమావేశంలో వీరు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఐజయ్య, శామ్యూల్, ఇమాంబాషా, ఆనంద్, రెడ్డన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

రాజంపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు పాటించని ప్రైవేటు కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నేతలు శుక్రవారం డీఈవో శివప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. డీఈవో రాజంపేట ఎంఈవో కార్యాలయానికి రావడంతో వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా పాఠశాలలను నడపడం దారుణమన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. రామచరణ్, సూర్యవర్ధన్, పవన్‌కళ్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రామాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సభావనంలో శనివారం ఉదయం 10 గంటలకు మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జాషువా తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర రవాణా, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజవుతారని తెలిపారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరుకావాలని కోరారు.

ఆలయానికి 8 ఫ్యాన్లు విరాళం

సుండుపల్లె, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విరూపాక్ష చెన్నకేశవస్వామి ఆలయానికి వినాయకనగర్‌కు చెందిన పుత్తంబాకు దొరస్వామినాయుడు 8 ఫ్యాన్లు అందజేశారని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. కల్యాణ మండపం దిగువన , అన్నదాన సత్రంలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అనుమానాస్పద స్థితిలో నూతన వధువు అదృశ్యం

రాజంపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మెట్టినింటి నుంచి పుట్టింటికి భర్తతో కలసి బయలుదేరిన ఓ నూతన వధువు మార్గమధ్యంలో అదృశ్యమైంది. బంధువుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంకటగిరి మండలం సీసీ కండ్రిగకు చెందిన వెల్లూరు రాజాకు చిట్వేలి అగ్రహారానికి చెందిన వెంకటమ్మతో కొద్ది రోజుల క్రితం వివాహమైంది. దీపావళి పండుగకు పుట్టింటికి వచ్చేందుకు బుధవారం భర్తతో కలసి బయలుదేరింది. మార్గమధ్యంలోని రాపూరు బస్టాండులో అస్వస్థతకు గురైంది. దీంతో అపరిచితుడైన ఓ వ్యక్తి చికిత్స నిమిత్తం వారిని రాపూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఆమె కోలుకునేసరికి రాత్రి కావడంతో వారు వెళ్లాల్సిన బస్సులు వెళిపోయాయి. దీంతో అపరిచిత వ్యక్తి వారిని మరో మార్గంలో బుధవారం రాత్రికి రాజంపేటకు చేర్చాడు. అక్కడి ఓ తోటలో ఆశ్రయమిచ్చాడు. గురువారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన రాజా తిరిగి వచ్చేసరికి అతని భార్య కనిపించలేదు. దీంతో అపరిచిత వ్యక్తిని ప్రశ్నించగా ఆమె ఉదయమే చిట్వేలికి వెళ్లిపోయిందని నమ్మించారు. అతనిని బైక్‌పై రాజంపేట పాతబస్టాండుకు తీసుకువచ్చి రాపూరు వెళ్లే బస్సు ఎక్కించారు. ఇంటినుంచి వెళ్లిన దంపతులు గమ్యస్థానానికి చేరకపోవడంతో ఆందోళనకు గురైన ఇరు కుటుంబాల సభ్యులు వెతకడం ప్రారంభించారు. అనుమానంతో రాపూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంతలో రాపూరులో బస్సు దిగిన రాజాను ప్రశ్నించగా ఆమె చిట్వేలికి వెళ్లిపోయిందని సమాధానమిచ్చాడు. కాగా, ఆమె పుట్టింటికి చేరకపోవడంతో శుక్రవారం రాజంపేటకు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, అపరిచిత వ్యక్తి ముఖానికి మాస్కు ధరించాడని రాజా చెబుతున్నాడు. తోటలో విశ్రాంతి తీసుకున్న సమయంలో తమతోపాటు మరో ఇద్దరు వ్యక్తులున్నారని చెబుతున్నాడు.

కారు ఢీకొని స్కూటరిస్టుకు గాయాలు

గాలివీడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో స్కూటరిస్టు తీవ్రంగా గాయపడ్డాడు. ఆవులశెట్టివారి పల్లెకు చెందిన మోడెం ఈశ్వరయ్య శుక్రవారం రాత్రి కోనంపేట రహదారిలోని పెట్రోల్ బంకు సమీపంలో బైక్‌పై వెళుతుండగా , గాలివీడు నుంచి నూలివీడుకు వెళుతున్న కారు ఢీకొనడంతో అతని కుడి మోకాలు విరగగా, చేతివేళ్లు దెబ్బతిన్నాయి. క్షతగాత్రుడిని ప్రైవేటు వాహనంలో రాయచోటి ఆస్పత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. సర్పంచ్ ఉమాపతి రెడ్డి కారును అతి వేగంగా నడిపి ప్రమాదానికి కారణమయ్యాడని వారు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నా పట్టించుకోకుండా కారుతో సహా వెళ్లిపోయాడని అందులో వివరించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

జూదరుల అరెస్ట్

- రూ.12,900 నగదు, మూడు సెల్‌ఫోన్లు, 6 ద్విచక్రవాహనాలు స్వాధీనం



పోలీసులు సీజ్ చేసిన ద్విచక్రవాహనాలు

సుండుపల్లె, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు జూదరులను అరెస్టు చేసినట్లు శుక్రవారం ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని పెద్దినేనికాల్వ గ్రామ పంచాయతీ చెరుకువాండ్లపల్లె సమీపం లోని మామిడి తోటలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని, రూ.12,900 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరి కొంతమంది పరారైనట్లు తెలియజేశారు. 6 ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు తెలియజేశారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నయనం రోటరీ ధ్యేయం

● వైద్యుల కృషి... సభ్యుల సేవ.. దాతల సహకారం ● చీకటిని చీల్చే 'నయన'కాంతులు
● ప్రొద్దుటూరు రోటరీ కంటి ఆస్పత్రిలో పేదలకు మెరుగైన సేవలు

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు. కళ్లు లేని జీవితం ముందుకు సాగలేదు. ఎదుటి వ్యక్తులను ఆకట్టుకునేవి కళ్లు. మన ఆలోచనలు, ఆరోగ్యానికి ప్రతిబింబాలు కళ్లు... రంగుల ప్రపంచాన్ని చూస్తూ... కోటి కాంతులను పంచుతూ... కలలను పండించుకోవాల్సిన కళ్లకు కమ్ముకున్న కాలుష్యం, పోషకాహార లేమితో నిర్జీవంగా మారుతున్నాయి. పొడిబారడం, చూపు మందగించడం, శుక్లాలు వంటి సమస్యలకు గురవుతున్నాయి. ఇలాంటి ఎన్నో బాధలను గుర్తించి దాతల దాతృత్వం, ట్రస్టు సభ్యుల సేవ, వైద్యుల కృషితో పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయి. వీటి ఫలితంగా 40 ఏళ్లుగా నిరుపేదలకు నయనాల వెలుగులను ప్రసాదిస్తోంది ప్రొద్దుటూరు రోటరీ కంటి ఆస్పత్రి. వివరాల్లోకెళితే....

కంటి కటకం 35 శాతం ప్రొటీన్‌తోనూ 65 శాతం నీటితో నిండిఉంటుంది. వయసు పెరిగే కొద్దీ ప్రొటీన్ క్షీణిస్తూ ముద్దలుగా తయారవుతుంది. ఐదు పదులు దాటిన సగం మందికి, ఏడు పదులు దాటిన 70 శాతం మందికి కంటి సమస్యలు మొదలవుతాయి. ఫలితంగా క్రమక్రమంగా చూపు మసకబారుతుంది. చూపు పరిధిలో (ఫీల్డ్ ఆఫ్ విజన్) మధ్య ప్రాంతం మసకబారుతుంది. రంగులు యధాతథంగా కన్పించవు. స్పష్టత లోపిస్తుంది. ఇలాంటి సమస్యలన్నీ ప్రజలను పట్టి పీడిస్తుంటోంది. కంటి సమస్య నుంచి బయట పడాలంటే మహానగరాలకు వెళ్లాల్సి వస్తుండేది. అంతేకాకుండా అక్కడ వైద్యానికి అయ్యే ఖర్చు తడిసి మొపడయ్యేది. దీంతో 1985లో ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే కొప్పరపు సుబ్బారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోమిశెట్టి చిన్నసుబ్బరాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త దేవరశెట్టి మోహన్‌రావు, పేదల కోసం రోటరీ సర్వీస్ కాంప్లెక్స్ ట్రస్టును స్థాపించారు. ఇక్కడ అప్పట్లోనే పేదలకు నాణ్యమైన వైద్యం, ఉచితంగా కంటి సేవలు అందించేవారు. ఎంతో మహోన్నతమైన సంకల్పంతో స్థాపించారు. 2004లో సోమిశెట్టి చిన్నసుబ్బరాయుడు అల్లుడు గాథంశెట్టి రామక్రిష్ణ(యూఎస్‌ఏ), మరి కొందరు కలిసి ఈ ఆస్పత్రిని పునరుద్ధరించారు. 2005 నుంచి తాండవకృష్ణ, ఎంవీఎస్ ప్రభు, కోటా శివకుమార్ సహా మరో 13 మంది ఉచితంగా ఈ ట్రస్టు ద్వారా తమ అమూల్యమైన సేవలను అందిస్తున్నారు. రోటరీ సర్వీస్ కాంప్లెక్స్ ట్రస్టు ద్వారా వందలాది మంది నిరుపేదలు ఉచితంగా కంటి వైద్యం పొందుతున్నారు. వైద్యసేవలు, శస్త్ర చికిత్స, ఉచితంగా ఆహారం, మందులు, కంటి అద్దాలను ఆస్పత్రి సమకూర్చుతుండడంతో పేదల కళ్లల్లో వెలుగులు నిండుతున్నాయి.



శస్త్ర చికిత్సకు ముందు సమస్యను పరిశీలిస్తున్న నిపుణులు



శస్త్ర చికిత్సకు ఉపయోగించే ఆధునిక పరికరం ఫ్యాకోమిషన్

ఆధునిక వైద్య సేవలు

రోటరీ కంటి ఆస్పత్రి పరిసరాలు శుభ్రంగా కార్పొరేట్ స్థాయికి దీటుగా ఉన్నాయి. రోటరీ కంటి ఆస్పత్రిలో ముగ్గురు వైద్యులు, 20 మంది సిబ్బంది నిత్యం వైద్యసేవలు అందిస్తున్నారు. 20 పడకల సామర్థ్యం కలిగిన ఈ ఆస్పత్రి పేదలకు ఉచిత వైద్యం అందించడమేకాక ధనవంతులకు తక్కువ ఫీజుతో నాణ్యమైన శస్త్ర చికిత్సను కూడా చేపడుతున్నారు. ఆస్పత్రిలో రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యసేవలు అందుతున్నాయి. ఇందులో అత్యాధునిక వసతులతో కూడిన ఆపరేషన్ థియేటర్, కంటి విభాగానికి సంబంధించిన ఆధునిక పరికరాలైన ఏఆర్ మిషన్, ఎస్కాన్, లాన్సోమీటర్, స్కిట్‌ల్యాంప్, ఫ్యాకో ఎమల్సిఫికేషన్ సర్జరీ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఆధునిక పరికరాలతో శస్త్రచికిత్స, సమర్థవంతమైన వైద్యుల నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి. ప్రతి నెల మొదటి ఆదివారం నంద్యాలకు చెందిన రెటీనా వైద్యుడు డాక్టర్ క్రాంతి ఇక్కడ ఉచితంగా కంటి పరీక్షలు, నిర్ధారణ చికిత్స నిర్వహిస్తున్నారు. అంతేకాక ట్రస్టు ఆధ్వర్యంలో సేవా దృక్పథంతో ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్ విభాగాల వైద్యశిబిరాలను కూడా నిర్వహిస్తున్నారు. ఓపీ విభాగంలో ప్రతినెల సుమారు 3 వేల మంది ఇక్కడ వైద్యసేవలు పొందుతున్నారు. నెలకు సుమారు 300 ఆపరేషన్లు చేస్తున్నారు. శస్త్ర చికిత్స సమయంలో ఉచితంగా రక్త పరీక్షలను ఆస్పత్రిలోనే నిర్వహిస్తున్నారు. వైద్యులు, సిబ్బంది జీతభత్యాలు అందుతుండగా, ట్రస్టు సభ్యులందరూ ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా పేదలకు సేవా భావంతో ఉచిత సేవలు అందిస్తున్నారు.



శస్త్ర చికిత్స అనంతరం రోగిని పరిశీలిస్తున్న వైద్యురాలు చాందినీబేగం

పేదల సేవే పరమావధి



రోటరీ కంటి ఆస్పత్రిలో దాదాపుగా 40 ఏళ్లుగా పేదలకు ఉచిత కంటి వైద్యసేవలు నిర్వహిస్తున్నారు. రేషన్‌కార్డు ఉన్నవారికి ఉచిత వైద్యసేవలు, శస్త్ర చికిత్స, ఉచితంగా ఆహారం, మందులు, కంటి అద్దాలు అందిస్తున్నాం. సభ్యుల సేవాభావం చాలా గొప్పది. నేను 15 ఏళ్లగా ఇక్కడ సేవలను అందిస్తున్నాను. పేదలకు సేవ చేయడమే ట్రస్టు ముఖ్య ఆశయం.

కోటా శివకుమార్, రోటరీ కంటి ఆస్పత్రి ప్రెసిడెంట్, ప్రొద్దుటూరు.

చిరుత దాడిలో దూడ మృతి

- భయభ్రాంతులవుతున్న ప్రజలు



దూడ మృత కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ, పశువైద్య అధికారులు

నిమ్మనపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పొలం వద్ద ఆవుల కోసం వేసుకున్న రేకుల షెడ్డులో వున్న దూడపై చిరుత పులి దాడి చేయడంతో దూడ మృతి చెందింది. చల్లావారిపల్లి బోడికొండ పాడి రైతు ఆదెన్న తన పొలంలో పాడి ఆవుల కోసం రేకుల షెడ్డును వేశాడు. ఇందులో ఆవులను అక్కడే మేపుతూ వుండేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఎప్పటిలాగే పాడి ఆవులకు మేపు వేసి రేకుల షెడ్డులో నిద్రపోయిన ఆయన ఉదయం లేచి చూడగా షెడ్డు ముందు రక్తపు జాడలు కనిపించాయి. అయితే ఆవుల్లో దూడ కనిపించక పోవడంతో చుట్టుపక్కల వెదకగా 20అడుల దూరంలో దూడ రక్తపు మడుగులో చనిపోయి పడివుందని తెలిపాడు. దీంతో అటవీశాఖ, పశువైద్యాధికారులకు సమాచారం ఇవ్వడంతో మదనపల్లి ఆటవీ శాఖ డీఆర్‌ఓ మధుసూదన్, పశువైద్యాధికారి సురేష్, తవళం బీట్ ఎఫ్‌డీఓ దీప, సంఘటనా స్థలంలో దూడ కళేబరాన్ని పరిశీలించారు. చిరుత దాడితోనే దూడ మృతి చెందినట్లు ఆనవాళ్లు వున్నాయని, అటవీ ప్రాతంలో దగ్గరగా వుండడంతో దూడను చంపి అడవిలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసినట్లు డీఆర్‌ఓ భావించారు. చల్లావారిపల్లి, సమీప ప్రజలు అప్రమత్తంగా వుండాలని చిరుతపులి కనిపిస్తే అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. పశువైద్యాధికారి దూడ కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. శుక్రవారం బోడికొండ వద్ద గొర్రెలమందపై చిరుత దాడి చేయగా గట్టిగా కేకలు వేయడంతో చిరుత అక్కడి నుంచి పారిపోయినట్లు గౌనిగారిపల్లి రైతు శంకర తెలిపాడు. చిరుత దాడిలో రెండు గొర్రెలు గాయపడ్డాయి. చిరుత సంచరిస్తోదని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌డీఓ దండోరా వేయించారు.

వైన్ లేదని రెచ్చిపోయిన యువకులు

- ములకలచెరువులో మద్యం దుకాణంపై దాడి

- రూ. 50వేలు విలువైన మద్యం బాటిళ్లు ధ్వంసం



దుకాణంలో ధ్వంసమైన మద్యం

ములకలచెరువు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో గుర్తుతెలియని యువకులు రెచ్చిపోయారు. మద్యం దుకాణంలో వైన్ లేదని చెప్పడంతో దాడి చేశారు. రూ.50వేలు విలువైన మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. ఈ విషయమై మద్యం దుకాణం యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.. ములకలచెరువులోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఆర్‌ఆర్ మద్యం దుకాణానికి గురువారం మధ్యాహ్నం గుర్తుతెలియని యువకులు మద్యం కోసం వచ్చారు. వైన్ కావాలని సేల్స్‌మెన్‌ను అడగడంతో లేదని సమాధానం చెప్పాడు. దీంతో ఆగ్రహానికి గురైన యువకులు మద్యం దుకాణంలో ఫర్నీచర్, మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. దీంతో పెద్ద ఎత్తున మద్యం బాటిళ్లు పగిలిపోయాయి. ఘటన జరిగిన తక్షణం స్పందించిన సీఐ రాజారమేష్, ఎస్‌ఐ గాయత్రి నిందితుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఈ విషయంపై మద్యం దుకాణం యజమాని చాకీ సెంటర్ నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

కోదండరామాలయంలో 'ఆక్టోపస్' మాక్ డ్రిల్

ఒంటిమిట్ట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక శక్తులు, టెర్రరిస్టులు దాడులు చేస్తే ఎలా ఎదుర్కోవాలనే అంశంపై కోదండ రామాలయంలో ఆక్టోపస్ పోలీసులు మాక్‌డ్రిల్ చేపట్టారు. ఆలయంలోకి ప్రవేశించిన టెర్రరిస్టులను చుట్టుముట్టి అంతమొందించడం, అనంతరం భక్తులను రక్షించే విధానాన్ని ప్రదర్శించారు. గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్, వైద్య సిబ్బంది అప్రమత్తత, రెవెన్యూ అధికారులు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆక్టోపస్, రెవెన్యూ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



విన్యాసం చేస్తున్న ఆక్టోపస్ సిబ్బంది

రూటా జిల్లా అధ్యక్షుడిగా రెహమాన్



సిబాతుర్ రెహమాన్, అబ్దుల్‌నాదిర్ షావలి,

మదనపల్లె అర్బన్/రాయచోటిటౌన్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): రూటా అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా ఎస్ఎండీ సిబాతుర్ రెహమాన్, జిల్లా కార్యదర్శిగా అబ్దుల్ నాదిర్ షావలిని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, రూటా అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ షేక్. మహమ్మద్ అలీ, పరిశీలకుడు పీఎండీ ఇలియాస్ తెలిపారు. అన్నమయ్య జిల్లా పరిధిలోని మదనపల్లె మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ప్రాంతీయ సదస్సులో ఉర్దూ మీడియం స్కూళ్ల సమస్యలపై చర్చించారు. అనంతరం జిల్లా కార్యవర్గ ఎన్నిక చేపట్టారు. ఎన్నికల అధికారి, పరిశీలకుల సమక్షంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి మరో 16 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రూటా ఫౌండర్, ప్రెసిడెంట్ సయ్యద్ హిదాయతుల్లా, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, రాష్ట్ర సమన్వయకర్త మహమ్మద్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

12 మంది కోడి పందెంరాయుళ్ల అరెస్టు

25 బైకులు స్వాధీనం ● యాభై మంది పరారీ

కలికిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న కోడి పందెంపై కలికిరి పోలీసులు భారీ స్థాయిలో జరిపిన దాడుల్లో 12 మంది పందెంరాయుళ్ళు పట్టుబడ్డారు. వీరితోపాటు 25 బైకులను స్వాధీనం చేసుకోగా మరో యాభై మంది వరకూ పందెంరాయుళ్ళు పారిపోయారు. సంఘటనపై ఇన్‌స్పెక్టర్ కె. రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల్లోకెళితే... చీకటిపల్లె పంచాయతీ రంగనాథపురం వద్ద శుక్రవారం భారీ స్థాయిలో కోడిపందెం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. కొందరు పందెం జరుగుతున్న తీరును వీడియో తీసి జిల్లా పోలీసు అధికారులకు పంపడంతో స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. అధికారుల ఆదేశాల మేరకు కోడి పందెం జరుగుతున్న ప్రాంతాన్ని పోలీసులు చుట్టుముట్టారు. పోలీసుల రాకను పసిగట్టిన పందెంరాయుళ్ళు దాదాపు యాభై మంది వరకూ పారిపోయారు. మరో 12 మంది పోలీసులకు పట్టుబడ్డారు. వీరితోపాటు 25 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారి నుంచి తొమ్మిది పందెం కోళ్ళు, రూ.19,990ల నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారందరినీ అరెస్టు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలో జూదం, కోడి పందాలు వంటి వాటిని నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

వ్యక్తి ఆత్మహత్య



చంద్ర మృతదేహం

ములకలచెరువు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జీవితం మీద విరక్తి చెంది తోట చంద్ర ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే..... గూడుపల్లె పంచాయతీ కనుగొండవారిపల్లె వాసి తోట చంద్ర ములకలచెరువులోని ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవిస్తున్నాడు కొంత కాలంగా భార్య, పిల్లల గురించి పట్టించు కోలేదు. దీంతో భార్య, పిల్లలు దూరంగా ఉన్నారని జీవితంపై విరక్తి చెంది ఇంట్లో కమ్మికి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై మృతుని భార్య భవాని ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గాయత్రి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఇసుక అక్రమ రవాణా వాహనాలు పట్టివేత

8 టిప్పర్లు, 2 లారీలు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం



వాహనాలను స్వాధీనం చేసుకున్న నందలూరు తహసీల్దారు

ఒంటిమిట్ట/నందలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ఎనిమిది టిప్పర్లు, రెండు లారీలు, ఎక్స్‌కవేటర్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఒంటిమిట్ట చెయ్యేరునది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు టిప్పర్లను ఒంటిమిట్ట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బిల్లులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను స్వాధీనం చేసుకుని, డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు తేలడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివప్రసాద్ వివరించారు.

నందలూరు మండలం కుందా నెల్లూరు సమీపంలోని పాత ఇసుక రీచ్‌లో శుక్రవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు టిప్పర్లు, రెండు లారీలు, ఒక ఎక్సకవేటర్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దారు అమర్‌నాథ్ పేర్కొన్నారు. అందిన సమాచారం మేరకు నిఘా ఉంచి వాహనాలను పట్టుకున్నామన్నారు. సీజ్ చేసిన వాహనాలు తహసీల్దారు కార్యాలయం వద్ద ఉంచినట్లు తెలిపారు. వీఆర్‌ఓ శివ, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మహిళ మృతిపై విచారణ!

వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆరోపణలు ● విచారణకు ఆదేశించిన కలెక్టర్



ఆస్పత్రిలో విచారిస్తున్న డీఐఓ డాక్టర్ ఉషశ్రీ, తహసీల్దారు భీమేశ్వరరావు

పీలేరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ఆస్పత్రిలో వైద్యం పొందుతూ మహిళ మృతి చెందడం కలకలం రేపింది. వైద్యుల నిర్లక్ష్యంతో ఆమె మృతి చెందిందని ఆరోపణలు వెల్లువెత్తడంతో కలెక్టర్ చామకూరి శ్రీధర్ విచారణకు ఆదేశించారు. దీంతో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉషశ్రీ, పీలేరు తహసీల్దారు భీమేశ్వరరావు, తలుపుల పీహెచ్‌సీ వైద్యాధికారి రమేశ్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. వివరాల్లోకెళితే...

గోరంట్లపల్లె పంచాయతీ కురవపల్లెకు చెందిన లక్ష్మీదేవి(55) తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతుండడంతో బంధువులు బుధవారం ఉదయం ఆమెను ఎస్‌కేఆర్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అప్పటికే ఆమె పరిస్థితి బాగలేకపోవడంతో వైద్యులు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి పేగుల్లో నెలకొన్న అంతర్గత రక్తస్రావం కారణంగా నొప్పి వస్తోందని, గుండె, కిడ్నీల సమస్యలతో ఆమె బాధపడుతోందని నిర్ధారించినట్లు వైద్యులు చెబుతున్నారు. అయితే ఏదైనా పెద్ద ఆస్పత్రులకు వెళ్లాలని సూచిస్తే ఆర్థిక స్తోమతలేదని, ఇక్కడే ఆపరేషన్ చేయాలని కోరడంతో ఆపరేషన్ చేసినట్లు వైద్యులు తెలిపారు. కొద్దిసేపటికి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లెలోని ఓ హృద్రోగ నిపుణుడి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం ఆమె కన్నుమూసింది. దీంతో పీలేరులో జరిగిన వైద్యంలో లోపాలున్నాయని, ఈ కారణంగానే ఆమె చనిపోయిందని ఆరోపిస్తూ బంధువులు మృతదేహంతో ఆస్పత్రి చేరుకున్నారు. పెద్దఎత్తున జనం గూమిగూడడంతో పోలీసులు రంగప్రవేశం చేసి వారికి సర్దిచెప్పారు. జరిగిన సంఘటనపై ఆరా తీశారు. అయితే ఎస్‌కేఆర్ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మహిళ మృతి చెందిందని ప్రజాసంఘాలు, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సంఘటనపై సమగ్ర విచారణ జరిపి తనకు నివేదిక అందజేయాలని కలెక్టర్ జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిని ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఆమె పీలేరు తహసీల్దారు భీమేశ్వరరావు, తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేశ్‌రెడ్డి సమక్షంలో ఆస్పత్రి నిర్వాహకుడు డాక్టర్ వసీంను విచారించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ విచారణ సారాంశాన్ని నివేదిక కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

ఆరోపణలు తగదు

- ఐఎంఏ అధ్యక్షుడు

ఏదైనా సంఘటన జరిగినప్పుడు పూర్వాపరాలు విచారించకుండా కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం బాధిస్తోందని ఐఎంఏ పీలేరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఐఎంఏ సభ్యులతో కలిసి ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సంఘటన జరిగినప్పుడు వైద్యుల వివరణ లేకుండా పోస్టులు పెట్టడం సరికాదన్నారు. మహిళ హాలో విస్కస్ పెర్ఫోరేషన్, సెప్సిస్, సీకేడీ, సీఓపీడీ వ్యాధులతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చిందన్నారు. ఆ లక్షణాలున్న వారిలో 50 శాతం ప్రమాదం ఉంటుందని తెలిపారు. సమావేశంలో వైద్యులు రాజా సాహెబ్, భారతి, ఈశ్వర సురేంద్ర, శశి, భరత్, వసీం, తదితరులు పాల్గొన్నారు.

'డీడీఆర్‌సీ'ని విజయవంతంగా నిర్వహించాలి

కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు1 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధ న్‌రెడ్డి ఆధ్వర్యంలో 3న నిర్వహించబోయే డీడీఆర్‌సీ సమావేశాన్ని విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంత్రి జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ రివ్యూ కమిటీ సమావేశంపై జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లా అధికారులందరూ శాఖల పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర నివేదికలను తయారు చేసి వెంటనే సీపీఓకి అందజేయాలని ఆదేశించారు. వీటిని జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వివరించేందుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తయారు చేయాలని జాయింట్ కలెక్టర్, సీపీఓను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రేపు జిల్లా అభివృద్ధి సమీక్ష : కలెక్టర్

3న జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. పీజీఆర్‌ఎస్ సమావేశం హాలులో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తారన్నారు. సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్ధన్ రెడ్డి, క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో అమలవు తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమగ్ర నివేదికలు రూపొందించాలని అధికారులందరికీ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు.

దేశ భద్రతే ధ్యేయంగా వల్లభాయ్ పటేల్ కృషి



5కే రన్‌లో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది

రాయచోటిటౌన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): దేశ భద్రత ఐక్యత పట్ల నిస్వార్థంగా కృషి చేసిన వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని రాయచోటి డీఎస్పీ విష్ణుమోహన్ అన్నారు. గురువారం దేశ సమైక్యత దినోత్సవం పురస్కరించుకుని జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ సమైక్యతా దినంగా పరిగణించి యూనిటీ రన్ నిర్వహించారు. పటేల్ విగ్రహానికి నివాళులర్పించి యూనిటీ రన్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఉప ప్రధానిగా, మొట్టమొదటి కేంద్ర హోం మంత్రిగా పటేల్ దేశానికి అంకిత భావంతో సేవలందించారన్నారు. యూనిటీ రన్‌లో ఏఆర్ డీఎస్పీ చిన్నిక్రిష్ణ, ఆర్(అడ్మిన్), రామక్రిష్ణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పెద్దయ్య, లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ - ఒకరు మృతి

గాలివీడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేరాలగుట్ట వద్ద రెండు బైక్‌లు ఢీకొనడంతో సురేంద్ర (42) మృతి చెందగా కదిరి రామకృష్ణ గాయాల పాలయ్యారని పోలీసులు తెలిపారు. ఈతోటివారిపల్లె వాసి రామకృష్ణ బైక్‌పై వెళుతుండగా పేరాలగుట్ట వద్ద పెద్ద మండెం మండలం మట్లివారిపల్లె వాసి సురేంద్ర బైక్‌తో ఢీకొన్నాడు. రామకృష్ణ కాలికి గాయమైంది. తలకు బలమైన గాయమైన సురేంద్ర పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సురేంద్ర మృతి చెందినట్లు తెలిపారు. ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రహదారుల మరమ్మత్తుల కోసం 'మిషన్ పథ్ హోల్ ఫ్రీ'

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఆరు నియోజకవర్గాల్లో దెబ్బతిన్న రహదారుల మరమ్మత్తుల కోసం 'మిషన్ పథ్ హోల్ ఫ్రీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో దెబ్బతిన్న రహదారులను మరమ్మత్తులు చేపట్టేందుకు ప్రభుత్వం మిషన్ పథ్ హోల్ ఫ్రీని నేడు ప్రారంభించనుందని, జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో ముఖ్యమైన రహదారుల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాయచోటి నియోజకవర్గం సంబేపల్లెలో నీకే రోడ్డు నుంచి నరసారెడ్డిపల్లె రహదారిపై దెబ్బతిన్న ప్రదేశాల్లో మరమ్మతులు, కోడూరు నియోజకవర్గం పెద్ద ఓరంపాడు నుంచి ఎల్లాయిపల్లి ఆశ్రమం వరకు రహదారిపై మరమ్మతులు, పీలేరు నియోజకవర్గం పొంతలచెరువు నుంచి తిమ్మాపురం రహదారిపైన మరమ్మత్తులు, మదనపల్లె నియోజకవర్గం అనంతపూరు- పలమనేరు నుంచి బొమ్మనచెరువు రోడ్డుపై, రాజంపేట నియోజకవర్గం సీఆర్‌పీ నుంచి తాళ్లపాక వరకు రహదారిపై, తంబళ్లపల్లె నియోజకవర్గం కోటకొండ నుంచి దందువారిపల్లి రహదారిపై మరమ్మతులు మిషన్ పథ్ ఫ్రీ ద్వారా చేయనున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రూ.50వేలు కొట్టు.. బెల్టుషాపు పట్టు

- మద్యం వ్యాపారుల బంపర్ ఆఫర్
- పోటీ పడుతున్న బెల్టుషాపు నిర్వాహకులు
- పల్లెల్లో జోరుగా వెలుస్తున్న బెల్టుషాపులు
- కొరవడిన ఎక్సైజ్, పోలీసుశాఖల నిఘా



బద్వేలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాగినోడికి తాగినంత అన్న ట్లు ఎక్కడ పడితే అక్కడ మద్యం పుల్లుగా దొరుకుతోంది. మద్యం షాపులు దక్కించుకున్న వాళ్లే బెల్టుషాపుల ఏర్పాటుకు తెరలేపారు. రూ.50వేలు ఇవ్వండి.. బెల్టుషాపు పెట్టుకోండి అంటూ బంపర్ ఆఫర్ ఇస్తున్నారు. దీంతో పల్లెల్లో జోరుగా బెల్టుషాపులు వెలుస్తు న్నాయి. కొత్తమద్యం పాలసీ ప్రక్రియ పూర్తయి జిల్లా వ్యాప్తంగా మద్యం షాపులు వెలిశాయి. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభు త్వంలో రకరకాల కొత్త మద్యం బ్రాండ్‌లను విక్రయించారు. సగటు మద్యం ప్రియులు ఎక్కువగా తాగే పాత బ్రాండ్‌లు కనిపించకుండా చేశారు. తెలుగు దేశం ప్రభుత్వం ఏర్పడ్డాక మద్యం పాల సీలో పాత మద్యం బ్రాండ్‌లు అందుబాటులోకి తెచ్చారు. అన్ని రకాల నాణ్యమైన బ్రాండ్‌లను విక్రయిస్తామని ప్రభుత్వం చెబుతూ వచ్చింది. ఆ మేరకు మద్యం షాపుల్లో వివిధ రకాల బ్రాండ్లు దిగాయి. ఇదే అదునుగా టెండర్లలో మద్యం షాపులు దక్కించుకున్న వారు మద్యం విక్రయాలను పెద్ద ఎత్తున విక్రయించి సొమ్ము చేసుకునే పనిలో పడ్డారు. మద్యం షాపుల ఏర్పాటుకు భారీగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చిందని.. ఆ డబ్బులు త్వరగా సంపాదించుకునేందుకు బెల్టుషాపుల ఏర్పాటుకు తెగబడినట్లు తెలుస్తోంది.

ప్రతి మండల కేంద్రంలో షాపులు దక్కించుకున్న వారు ఆ మండలంలోని గ్రామాలలో బెల్టుషాపులు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. బద్వేలు, పోరుమామిళ్ల లాంటి ప్రాంతంలో మద్యం షాపులు దక్కించుకున్న వారు బెల్టుషాపులు పెట్టుకునేందుకు సిండికేట్‌లుగా ఏర్పడి ఊర్లను పంచుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో బెల్టుషాపులు పెట్టుకునే వారు కూడా ఎక్కువయ్యారు. బెల్టుషాపుల ద్వారా లక్షలు సంపాదించే పరిస్థితులు ఉండడంతో పల్లెల్లో బెల్టుషాపులకు పోటీ ఎక్కువైంది. దీంతో బెల్టుషాపు కావాల్సిన వారు 50వేలు చెల్లిస్తే... మందు సరఫరా చేస్తామంటూ మద్యం వ్యాపారులు తెగేసి చెబుతున్నారు. దీనికి బెల్టుషాపు నిర్వాహకులు తగ్గేది లేదంటూ మద్యం షాపులు దక్కించుకున్న వారికి డబ్బులు ముట్టు చెబుతున్నారు. ఈ లెక్కన పల్లె పల్లెకు ఒక బెల్టుషాపు వెలుస్తున్నట్లు సమాచారం.

బద్వేలు నియోజకవర్గ వ్యాప్తంగా 17 మద్యం షాపులు ఏర్పాటయ్యాయి. ఒక్క మద్యం షాపు ద్వారా 10 నుంచి 15 వరకు బెల్టు షాపులు పెట్టే పరిస్థితులు కనపడుతున్నాయి. బెల్టుషాపుల ద్వారానే మద్యంషాపుల యజమానులకు కనీసం అంటే ఆరేడు లక్షలు వసూలయ్యే అవకాశం ఏర్పడింది. మద్యం షాపుతో పాటు బెల్టు షాపులు ఏర్పాటు చేస్తే ఎక్కువ రేట్లకు మద్యం విక్రయించి పెట్టిన పెట్టుబడితో పాటు లక్షలు సంపాదించుకోవచ్చనే ఆలోచనతో మద్యంషాపుల వారు బిజీగా ఉన్నారు. బెల్టుషాపులు ఎక్కువైతే ఇప్పటివరకు ప్రశాంతంగా ఉన్న పల్లె సీమల్లో వివాదాలు, గొడవలు చోటు చేసుకునే పరిస్థితి ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈపరిస్థితులలో బెల్టుషాపుల ఏర్పాటుపై ఎక్సైజ్‌శాఖాధికారులు, పోలీసులు నిఘాపెట్టి చర్యలు తీసుకోవాల్సి అవసరం ఉంది.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

గ్రామాలలో ఎవరైనా బెల్టుషాపులు నిర్వ హిస్తే కఠిన చర్యలు తప్పవు. బెల్టుషా పుల ద్వారా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం. ఇప్ప టికే బెల్టుషాపులపై ప్రత్యేక దృష్టి సారిం చి.. చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా బెల్టుషాపులు ఏర్పాటు చేస్తున్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలి.

-సీతారామిరెడ్డి, ఎక్సైజ్ సీఐ, బద్వేలు

బెల్ట్ షాపు నిర్వాహకులకు కౌన్సెలింగ్

కాశినాయన నవంబరు (ఆంధ్రజ్యోతి) 1: నర్సాపురం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఎస్ఐ హనుమంతు పలువురు బెల్టుషాపు నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మండల వ్యాప్తంగా పలుగ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్ముతుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. పట్టుబడిన వారికి ఎస్ఐ కౌన్సెలింగ్ ఇస్తూ.. ఇకపై అక్రమంగా మందు అమ్ముతూ పట్టుబడితే కేసు నమోదు చేసి రూ.లక్ష రూపాయలు జరిమానా విధిస్తామన్నారు. అనంతరం వీరిని తహసీల్దారు వెకంటసుబ్బయ్య వద్ద బైండోవర్ చేశామని తెలిపారు.



బెల్టుషాపు నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ హనుమంతు

377 పరుగుల భారీస్కోర్ సాధించిన అనంతపురం జట్టు



కిరణ్‌కుమార్ (109 పరుగులు), ప్రణధీర్ (79), కౌశిక్ (75)

కడప స్పోర్ట్స్, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ డిస్ట్రిక్ట్ గ్రూప్-బి మల్టీ డే రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా శుక్రవారం విజయనగరం జట్టుపై అనంతపురం జట్టు 377 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇతర మ్యాచ్‌లలో గుంటూరు, శ్రీకాకుళం జట్లు స్వల్ప స్కోర్ల వెనుకంజలో వున్నాయి. వివరాలిలా.... కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం-విజయనగరం జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో తొలుత టాస్‌నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 377 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో కిరణ్‌కుమార్ 109 పరుగులు చేయగా.. ప్రణధీర్ 79, రోహిత్ రాయల్ 57 పరుగులు చేశారు.

కేఓఆర్ఎం మైదానంలో నెల్లూరు-గుంటూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 49 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 39 ఓవర్లలో 1 వికెట్ నష్టపోయి 137 పరుగులు చేసింది. ఇందులో కౌశిక్ 75 పరుగులు చేశారు. అలాగే నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో క్రిష్ణా-శ్రీకాకుళం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన క్రిష్ణా జట్టు బ్యాటింగ్‌కు దిగి 60.1 ఓవర్లలో కేవలం 115 పరుగులకే చేతులెత్తేసింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేసింది. ఇందులో జోగేంద్ర 33 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. దీంతో మరో 13 పరుగుల వెనుకంజలో శ్రీకాకుళం జట్టు నిలిచింది. ఆటకు శనివారం చివరిరోజు

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



పులివెందుల టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల పట్టణంలోని శ్రీనివాస హాల్ థియేటరు సమీపంలోని తమ ఇంట్లో నవ్యశ్రీ (21) అనే వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బంధువుల కథనం మేరకు.. పులివెందుల పట్టణం శ్రీనివాస థియేటరు సమీపంలో నివశిస్తున్న మహేశ్‌కుమార్ అనే వ్యక్తి స్టేట్‌బ్యాంకులో అటెండరుగా విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి సత్యసాయి జిల్లా తలుపులకు చెందిన నవ్యశ్రీతో దాదాపు 16 నెలల కిందట వివాహమైంది. మహేశ్‌కుమార్ ఉద్యోగానికి వెళ్లడంతో ఎవరూ లేని సమయం చూసి నవ్య చీరతో ఉరి వేసుకుని మృతి చెందింది. మధ్యాహ్నం భోజనానికి వచ్చిన మహేశ్ ఎంత సేపు తలుపు తట్టినా డోరు తీయకపోవడంతో ఇతరుల సాయంతో తలుపు పగలగొట్టి ఇంట్లో ప్రవేశించాడు. అయితే అప్పటికే నవ్యశ్రీ ఉరి వేసుకుని మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషం తెలుసుకున్న ఎస్ఐ నారాయణ సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అయన తెలిపారు. నవ్యశ్రీ మృతికి కుటుంబ కలహాలా లేక మరేమైనా కారణమా అనేది విచారణలో తేలాల్సి ఉంది.

ఆర్టీసీ బస్సు ఢీ - పలువురికి గాయాలు



ఘటనా స్థలంలో గాయపడినవారు

జమ్మలమడుగు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామ సమీపాన గురువారం ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొన డంతో పలువురికి గాయాలయ్యాయి. వివరాలిలా.. నొస్సం గ్రామం నుంచి ప్రయాణికులతో ఆటో జమ్మలమడుగు వస్తుండగా.. ఆళ్లగడ్డ నుంచి జమ్మలమడుగు వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుకవైపు నుంచి ఢీకొంది. దీంతో పెద్దముడియం మండలం కల్వటాల గ్రామానికి చెందిన హుస్సేన్‌సాహెబ్ అనే వ్యక్తికి కుడిచెయ్యి, కుడికాలుకు రక్తగాయాలయ్యాయి. అలాగే వెంకటసుబ్బమ్మ, నాగలక్ష్మి, సుబ్బలక్ష్మి, తదితరులు గాయపడ్డారు. వీరిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన హుస్సేన్‌సాహెబ్‌ను మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్ లీకై గాయపడ్డ వ్యక్తి మృతి

పెండ్లిమర్రి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండూరు హరిజనవాడకు చెందిన వేంపల్లె వరప్రుత్రుడు గత శుక్రవారం ఇంటి వద్ద గ్యాస్ సిలిండర్ లీకేజీ కావడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్త కడప రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

మూడు గడ్డివాములు దగ్ధం

పోరుమామిళ్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని మూల వీధిలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. టి.పద్మావతి, వరదరాజుల రత్తమ్మ, ముద్దేటి రమణయ్య అనే రైతులు పశువుల మేతకు నిల్వ ఉంచుకున్న గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక కేంద్రం అధికా రులు మంటలు అదుపు చేశారు. అయితే అప్పటికే గడ్డివాములు కాలిపోయి రూ.50వేలు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

అర్థవంతమైన చర్చ సాగేనా..?

- ప్రజా సమస్యలకు పరిష్కారం చూపేనా..?
- నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం



కడప రూరల్, నవంబరు 1 (అంధ్రజ్యోతి): జిల్లా పరిషత్(జడ్పీ) స్థాయి సంఘాల సమావేశాన్ని శనివారం జడ్పీలో నిర్వహించను న్నారు. ఇప్పటికి దాదాపు 13 సమావేశాలు నిర్వహించినప్పటికీ ఏనాడూ ఆయా శాఖల పనితీరుపై అర్థవంతమైన చర్చ కొనసాగించలేదు. అయా కమిటీల చైర్మన్లు, సభ్యులు మొక్కుబడి సమావేశాలతోనే సరిపుచ్చుతున్నారు. వెరసి సమావేశాల పేరుతో అయ్యే ఖర్చు లు మాత్రం తడిపి మోపెడవుతున్నాయి. ప్రణాళిక అండ్ ఆర్థికం, గ్రామీణాభివృద్ధి, విద్య మరియు వైద్యసేవలు, నిర్మాణపు పనులు, స్త్రీ సంక్షేమం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమ స్థాయి సంఘ సమావేశాలను నిర్వహించను న్నారు. 2024 ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ పంటలు దెబ్బతినడంతో రైతులు కష్టాలలో కొట్టుమిట్టాడుతున్నారు. పంటనష్ట పరిహారం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా అందడంలో జాప్యం జరుగుతోంది.

రబీలో అదునులో వర్షాలు పడినప్పటికీ పంటసాగుకు తగిన రుణాలు అందక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతినడంతో వాటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు హల్‌చల్ చేస్తున్నాయి. గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి. జిల్లాలోని ఆయా గ్రామాలలో కనీస శుభ్రతలేదు. ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనమిస్తోంది. పారిశుధ్యపు పనులు సక్రమంగా సాగడం లేదు. విషజ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. అనుపత్రుల్లో తగిన మందుల్లేక నానా యాతన పడుతున్నారు. గ్రామీణ మంచినీటి సరఫరా పథకం నత్తనడకన సాగుతోంది. ఇక నిరుపేదల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ఏర్పాటు చేసిన ఉపాధి హామీపథకం ద్వారా జిల్లాలో జరుగుతున్న పనుల్లో పురోగతి కనిపించడం లేదు. ఇదివరకు చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలోని వసతి గృహాల పనితీరు సక్రమంగా లేదు. తాగునీరు, ఇతర మౌలిక వసతులు లేక విద్యార్థులు అల్లాడుతున్నారు. సమగ్ర శిశు అభివృద్ధి పథకం ద్వారా జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల ద్వారా గ్రామ స్థాయిలో నడుస్తున్న పలు అంగన్‌వాడీలు అద్దెభవనాలలో కొనసాగుతున్నాయి. వీటిలో మౌలిక సదుపాయాలైన తాగునీరు, మరుగుదొడ్లు ఇతరత్రా సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదు. పీహెచ్‌సీ కేంద్రాలలో మౌలిక వసతుల లేమి, సిబ్బంది కొరత వేధిస్తోంది. వీటన్నింటిపై సమీక్ష నిర్వహించి ప్రజలకు న్యాయం చేయాల్సిన గురుతర బాధ్యత అధికారులు, ప్రజా ప్రతినిధులపై ఉంది. కానీ ఈ దిశగా స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించడం లేదు. శనివారం నిర్వహించే సమావేశమైనా పూర్తిస్థాయిలో చేపట్టి సమస్యలపై చర్చించి తగు పరిష్కారం చూపుతారని ప్రజలు భావిస్తున్నారు.

నా భర్త.. నాకు కావాలి

- భర్త ఇంటి వద్ద యువతి ఆందోళన
- పోలీసు స్టేషన్‌కు చేరిన పంచాయితీ



గురునాథం, అంకాళమ్మ పెళ్లి నాటి ఫొటో, గురునాథం ఇంటి వద్ద యువతి ఆందోళన

వేంపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా ప్రేమించుకున్నారు. ఓ గుడిలో పెళ్లి చేసుకున్నారు. అబ్బాయి తరపు తల్లిదండ్రులకు ఇష్టం లేకపోవడంతో వివాదం తలెత్తింది. దీంతో నా భర్త నాకు కావాలంటూ వారి ఇంటి ముందు అమ్మాయి ధర్నా చేయడంతో ఘర్షణకు దారితీసింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరంది. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అందిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. పూర్తి వివరాలిలా.. వేంపల్లెకు చెందిన పసుపులేటి గురునాథం, అలవలపాడు గ్రామానికి చెందిన అంకాళమ్మ కొప్పర్తి పారిశ్రామికవాడలోని ఓ కంపెనీలో పనిచేసే వారు. ఈ నేపథ్యంలో వీరు ప్రేమలో పడ్డారు. ఆరు సంవత్సరాలు ప్రేమించుకున్నారు. వారం రోజుల క్రితం తల్లిదండ్రులకు తెలియకుండా బద్వేల్ దగ్గర శివాలయంలో వివాహం చేసుకున్నారు. అనంతరం అలవలపాడులోని యువతి ఇంటికి వచ్చారు. మూడు రోజుల క్రితం ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన గురునాథం తిరిగి రాకపోవడంతో అంకాళమ్మ వేంపల్లెలోని గౌరీనగర్‌లో ఉన్న గురునాథం ఇంటి తమ బంధువులతో కలసి వెళ్లి ఆందోళనకు దిగింది. నన్ను పెళ్లి చేసుకున్నాడు, నా భర్త నాకు కావాలంటూ ధర్నాకు దిగింది. దీంతో అక్కడున్న అబ్బాయి తరపువారితో ఘర్షణకు దిగారు. ఈ విషయం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకోవడంతో పంచాయతీ పోలీసు స్టేషన్‌కు చేరింది. కాగా ఆ యువతి నన్ను పెళ్లిచేసుకున్నాడు, వారి తల్లిదండ్రుల ఒత్తిడితోనే నా భర్త వద్దకు రాలేదంటూ తెలిపింది. అయితే ఈ సమస్య కొలిక్కి రాలేదు, పంచాయితీ కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అందితే చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

మహిళ అదృశ్యం



కడప క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నాగరాజుపేటలో ఓ మహిళ అదృశ్యమైనట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. కమలాపురం మండలం చదిపిరాళ్ల గ్రామానికి చెందిన కొర్రపాటి శ్రీమంతి (29) గత కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడు తూ ఉండేది. అక్టోబరు 10వ తేదీ కడప నాగరాజుపేటకు వచ్చిన ఆమె తిరిగి ఇంటికి పోకపోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. మహిళా ఆచూకీ తెలిసిన వారు 9121100510, 9121100511కు సమాచారం అందించాలని కోరారు.

సర్పంచ్ మృతి

వల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దుగ్గాయపల్లె సర్పంచ్ పాశం పెద్దక్క మృతి చెందింది. దుగ్గాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని పాపాఘ్నినగర్‌కు చెందిన ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. గురువారం ఆమె నివాసంలో మృతి చెందింది. సమాచారం అందుకున్న వైసీపీ మండల కన్వీనరు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు అబ్బిరెడ్డి వీరారెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సుబ్బారెడ్డి, వైసీపీ నేతలు తదితరులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మైలవరానికి 9వేలక్యూసెక్కులు విడుదల

కొండాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి శుక్రవారం 9వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టులోకి అవుకు రిజర్వాయిర్ నుంచి జీఎన్ఎస్ఎస్ వరద కాలువ ద్వారా 9000 క్యూసెక్కుల కృష్ణాజలాలు వచ్చి చేరుతు న్నాయన్నారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.02 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ తెలిపారు.

విద్యార్థులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు

కడప క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగేలా పోలీసు అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నగరంలోని చౌడేశ్వరి స్కూలు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థి దశ నుండే క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదిగేలా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని యాంటి హ్యూమన్‌ట్రాఫికింగ్ ఎస్ఐ శాంతమ్మ విద్యార్థులకు సూచించారు.

4 నుంచి బీఈడి సెమిస్టరు పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలో బీఈడి కళాశాలల 2, 4 సెమిస్టర్ల విద్యార్థులకు ఈ నెల 4 నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు క్రిష్ణరావు తెలిపారు. ఈ పరీక్షల కోసం జిల్లావ్యాప్తంగా 16 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే 16900 మంది విద్యార్థులు హాజరవుతున్నారని అన్నారు. పరీక్షల నిర్వహణకు వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ మార్గదర్శకం మేరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల నిర్వహణకు అబ్జర్వర్లతో పాటు హైపవర్ కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్లను చదువుతున్న కళాశాలల నుంచి పొందాలన్నారు.

మదనపల్లె ఎంపీడీవోగా తాజ్‌మస్రూర్

మదనపల్లె టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఎంపీడీవోగా తాజ్ మస్రూర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గత నెలలో మదనపల్లె ఎంపీడీవోగా చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలంలో పనిచేస్తున్న తాజ్‌మస్రూర్‌ను జడ్పీ సీఈవో బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గుడుపల్లెలో ఆయనను రిలీవ్ చేయడానికి ఆలస్యం కావడంతో ఇక్కడ మదనపల్లె ఎంపీడీవో కార్యాలయం ఏవో మస్తాన్‌వలి ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహించారు. ఎట్టకేలకు గుడుపల్లెలో తాజ్‌మస్రూర్‌ను రిలీవ్ చేయడంతో ఆయన గురువారం మదనపల్లె ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు.

సాంకేతికతపై పట్టు సాధిస్తే పరిశ్రమల్లో ఉద్యోగాలు

మదనపల్లె టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన సాంకేతికతపై ఆధిపత్యం సాధిస్తే పరిశ్రమల్లో ఉద్యోగాలు సులువుగా దక్కించుకోవచ్చని వాల్‌మార్ట్ టెక్నాలజీ టీమ్ లీడర్ ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఏఈసీ విభాగానికి చెందిన విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాటాడుతూ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పరిశ్రమలకు ఏ రకమైన సేవలు అవసరమో అదే విధంగా విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి మాట్లాడుతూ సెమినార్లలో ప్రతి అంశాన్ని విద్యార్థులు అవగాహన పెంచుకుని భవిష్యత్‌లో సాంకేతికత ఉపయోగించుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, అధ్యక్షుడు నాగమల్లారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, అధ్యాపకులు వరప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

వృషభాచలేశ్వరా...ఏమిటీ దుస్థితి

- పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిన పుష్కరిణి



పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో అధ్వానంగా ఉన్న వృషభాచలేశ్వరస్వామి పుష్కరిణి

వేంపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయల స్థిర చరాస్తులు కలిగిన వేంపల్లె పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన వృషభాచలేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన పుష్కరిణి దయనీయ పరిస్థితిలో ఉంది. వేంపల్లె పట్టణంలోని మఠం వీధిలో పూర్వం నుంచి పుష్కరిణి ఉండేది. ఇక్కడ నీట మునిగి, అవతలి ఒడ్డున ఉన్న స్వామి వద్దకెళ్లి పూర్వం పూజలు చేసేవారు. కాల క్రమంలో శిథిలావస్థకు చేరుకోగా ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పుష్కరిణికి నిధులు కేటాయించి శిథిలావస్థలో ఉన్న దానిని సక్రమంగా నిర్మించారు. కార్తీకమాసంలో నదుల్లో నీళ్లు లేని సమయంలో ఇక్కడ గౌరీదేవి నిమజ్జనం చేసేవారు. ఇలా పవిత్రంగా ఉండాల్సిన పుష్కరిణి ప్రస్తుతం అధ్వానంగా తయారైంది.

దుర్గంధంలో పుష్కరిణి

పుష్కరిణి చూసిన ప్రజలు ఇదేమిటీ స్వామి ఇంత అధ్వానంగా ఉంచారంటూ ఆవేదన చెందుతున్నారు. పుష్కరిణి పిచ్చిమొక్కలతో నిండి మురికి కూపంలా తయారైంది. చెత్తాచెదారాంతో పాటు ప్యాకెట్లు ఒక్కచోటకు చేరి కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లు తోంది. ఇక పుష్కరిణి లోపలికి వెళ్లే ద్వారం వద్ద ఉన్న గేటు విరిగిపోయి ఉంది. ఎవరుపడితే వారు లోపలికి వెళ్లి మద్యం సేవిస్తున్నట్లు అక్కడి పరిస్థితిని బట్టి అర్థమవుతోంది. దీనిపై ఆలయ అధికారులు, సిబ్బంది దృష్టి సారించి పుష్కరిణి శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



ముఖద్వారం విరిగిపడి ఉన్న దృశ్యం

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం


అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సర్పంచ్ చలపతి

మదనపల్లె టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్నేటిపాళెం, కురవంక, అంకిశెట్టిపల్లె గ్రామ పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గ అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి అత్యధికంగా పల్లెపండుగ కార్యక్రమానికి రూ.8 కోట్ల నిధులు మంజూరు చేసుకున్నామన్నారు. కాంట్రాక్టర్లతో పనిలేకుండా ఆయా గ్రామ ప్రజలే సమష్టిగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకున్నామన్నారు. సీసీ రోడ్లను నాణ్యతగా నిర్మించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ఏఈని ఆదేశించారు. కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి, ఇన్‌చార్జి ఎంపీడీవో మస్తాన్‌వలి, పంచాయతీ కార్యదర్శి షబీనా, వీఆర్‌వో శేఖర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పనసమాకులపల్లె, కురవంక, రామిరెడ్డిగారిపల్లె, రవీంద్రనగర్, సిద్దమ్మ లే అవుట్, టీచర్స్‌కాలనిలో లబ్దిదారులకు సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దివ్యాంగుడు మహబూబ్‌బాషాను స్వయంగా కలసి ఎమ్మెల్యే పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నాగరాజు, ఎంపీటీసీ హారిక, టీడీపీ నాయకులు వేణు, రెడ్డిప్రసాద్, గురునాథ్, జీవీ నాయుడు, మధు తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో ఆధిపత్య పోరు

● గ్రామ పంచాయతీ ఈఓ టార్గెట్‌గా ఓ వర్గం ఆరోపణలు ● సామాజిక మాధ్యమాల్లో పోస్టులు ● బెదిరింపుల యత్నమంటున్న వైనం

పీలేరు, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మారిన ప్రభుత్వం, రాజకీయ సమీకరణాలతో పీలేరు గ్రామ పంచాయతీలో రాజకీయ ఆధిపత్యపోరు నెలకొంది. ప్రతిపక్షానికి కొరకరాని కొయ్యగా మారిన ఈఓను దెబ్బతీసేందుకు తమ మార్కు రాజకీయాలతో వైసీపీ నేతలు సోషియల్ మీడియా వేదికగా ఆయనపై దాడిని తీవ్రతరం చేస్తున్నారు. కొంత కాలంగా అంతర్గత కలహాలతో ఉన్న వైసీపీ నేత లు, ప్రస్తుతం ఈఓపై మూకుమ్మడి దాడి ప్రారంభించారు. పంచాయతీ పాలన గాడి తప్పిందని సాక్షాత్తు సర్పంచు, వార్డు సభ్యులు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెడుతుండడం విశేషం. తమ పోస్టులను స్థానిక గ్రూపుల్లో తమ అనుచరుల ద్వారా వైరల్ చేయించడం, తమకు అనుకూలంగా ఉన్న పంచాయతీ సిబ్బందిని ఆయనపై తిరుగు బాటు చేసేలా ప్రేరేపించడం, రెచ్చగొట్టే పనులకు పాల్పడుతుండడంతో పంచాయతీ కార్యాలయం నిత్యం చర్చనీయాంశమైంది.

వైసీపీ నేతలకు ఇక్కట్లు

2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలు చేసుకున్న అనంతరం పీలేరు పంచాయతీ పాలనా వ్యవహారాల్లో వైసీపీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారం చేపట్టడంతో వైసీపీకి ఇబ్బందులు ఎదురయ్యాయి. పీలేరు పంచాయతీ వ్యవ హారాలపై ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై ప్రత్యేక విచారణ జరిపించారు. ఇందులో నిధులు దుర్వినియోగమై నట్లు నిర్ధారణ కావడంతో పీలేరు ఈఓలుగా పని చేసిన వారిపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా పీలేరు ఈఓగా పనిచేసిన వాల్మీకిపురం పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ రెడ్డివరప్రసాద్‌ను సస్పెండ్ చేశారు. గతంలో ఈఓలుగా పనిచేసిన ఈఓపీఆర్ ఆర్‌డీలు వరప్రసాద్, ఎస్‌ఏగఫూర్‌పై శాఖాపర చర్యలకు రాష్ట్ర ఉన్నతాధికారులకు సిఫారసు చేశారు. వీటన్నింటి నేపథ్యంలో కలికిరి ఈఓ గురు మోహన్‌ను పీలేరు ఇన్‌చార్జి ఈఓగా జిల్లా ఉన్న తాధికారులు నియమించారు. అనంతరం జరిగిన సాధారణ బదిలీల్లో ఆయకు పూర్తి బాధ్యతలు అప్పగించారు. దీంతో తొలి అడుగుగా పంచాయతీ కార్మికులుగా నమోదు చేసుకుని పంచాయతీ నిధులతో జీతాలు తీసుకుంటున్న వైసీపీ నేతలు, వారి కుటుంబస భ్యులైన 22 మందిని తొలగించారు. అప్పటి నుంచి వైసీపీ నేతలు ఆయనపై ద్వేషం పెంచుకుని వ్యక్తిగత దాడికి పూనుకున్నా రు.

వైరల్‌గా మారిన ఈఓపై ఆరోపణలు

గతంలో కడప జిల్లాలో పనిచేసినప్పుడు ఆయన, ఆయన సహచర, సీనియర్ ఉద్యోగులు పెద్దఎత్తున అవినీతికి పాల్పడినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, వాటిని త్వరలోనే బహిర్గతం చేస్తామని కొందరు వైసీపీ నేతలు స్థానిక గ్రూపుల్లో పోస్టులు పెట్టారు. ఈ పోస్టులపై స్థానిక టీడీపీ నేతలు కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తూ కలికిరి ఈఓగా వైసీపీ నాయకులే గతంలో ఆయ నను తెచ్చుకున్నారని, వైసీపీ హయాంలో సచ్చీలు డైన అధికారి, టీడీపీ హయాంలో అవినీతిపరుడిగా ఎలా మారిపోయాడంటూ ప్రశ్నిస్తున్నారు. ఈఓను బెదిరించి లొంగదీసుకునేందుకు వైసీపీ నేతలు బెదిరింపులకు దిగారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

అక్రమార్జనను అడ్డుకున్నందుకే ఆరోపణలు

పీలేరు ఈఓగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి గతంలో విచ్చలవిడిగా సాగిన విద్యుత్ మోటార్ల రిపేర్లు, కొత్త వాటి కొనుగోళ్లను నియంత్రించ గలిగాను. ఈ అంశాలు నచ్చని కొందరు నాపై దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా విధులు నిర్వహించడం ఉద్యోగుల విధి. పంచాయతీ వ్యవహారాలను పారదర్శకంగా నిర్వహిస్తున్నాను. పోస్టుల వ్యవహారంపై త్వరలోనే చట్టపరంగా చర్యలు తీసుకుంటాను. పోలీసులకు ఫిర్యాదు కూడా చేస్తాను. పోస్టుల వెనుక ఎవరు న్నా వదిలిపెట్టేది లేదు.

-గురుమోహన్, ఈఓ, పీలేరు పంచాయతీ

వీఆర్‌ఏ కుటుంబానికి సాయం

కలకడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నడిమిచె ర్ల వీఆర్‌ఏ లక్ష్మయ్య కుటుంబానికి ప్రభుత్వ సాయం రూ.20 వేలను తహశీల్దార్ ఫణి కుమార్ శుక్రవారం అందజేశారు. లక్ష్మయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో తహశీల్దార్ వీఆర్‌ఏ దహన క్రియలకు ఆర్థికసాయం అందజేశారు.

వైన్ షాపుపై దాడి

తంబళ్లపల్లె, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసువారిపల్లెలో వైన్ షాపుపై శుక్రవారం కొందరు దాడి చేశారు. అంగళ్లుకు చెందిన ఆంజనేయులు ఇటీవల లాటరీలో వైన్ షాపును దక్కించుకుని నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి 10 గంటలకు షాపు మేనేజర్ గోపి యథావిధిగా షాపు మూసుకుని ఇంటికి వెళ్లాడు. అదే రాత్రి దుండగులు వైన్ షాపు పైకప్పుకు ఉన్న సిమెంటు రేకులను ధ్వంసం చేశారు. నిర్వాహకులు సంఘటనను గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు షాపును పరిశీలించారు.

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ

పీలేరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని శుక్రవారం పీలేరులోని ఆర్యవైశ్య, ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) సభ్యులు, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంత ప్రాంగణంలోని అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య, అవోపా సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీలేరు మండలం జంగంపల్లెలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించి ఆయన గురించి విద్యార్థులకు తెలియజేశారు.

పీటీఎంలో సభ్యత్వ నమోదు

పెద్దతిప్పసముద్రం నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు కట్టా సురేంద్ర నాయుడు నియోజకవర్గ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సహకరించాలని సురేంద్ర నాయుడు కోరారు.

సర్దార్ పటేల్‌కు ఘననివాళి

వాల్మీకిపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దేశ తొలి ఉపప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్, ప్రిన్సిపాల్ కల్పన పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

మదనపల్లె అర్బన్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి):ఉర్దూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో రాయలసీమ జిల్లాలకు చెందిన రాష్ట్ర ఉర్దూ టీచర్ల సంఘం ప్రాంతీయ సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 13 జిల్లాలో ఉర్దూను ద్వితీయ అధికార భాషగా చేసిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. రూటా రాష్ట్ర నాయకులు హాజీ సయ్యద్, హిమాతుల్లా, అయూబ్, సత్తార్ ఫౌజీ, ఎహసానుల్లా, ఫైరోజ్, రబ్బాని, సాలేహ, అలీకాన్, షాజహాన్, ఇస్మాయిల్, మహమ్మద్‌అలి, పఠాన్ మహమ్మ ద్ ఖాన్ పాల్గొన్నారు.

కురబలకోటలో చిల్లరదుకాణానికి నిప్పు

కురబలకోట, నవంబరు 1: మండలంలోని కురబలకోట ఎస్సీ కాలనీలోని టీడీపీ సానుభూతిపరుడికి చెందిన చిల్లరదుకాణానికి గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్సీ కాలనీకి చెందిన రామలక్ష్మి, రెడ్డెప్పలు టీడీపీ ఒక బంకును ఏర్పాటు చేసుకుని అందులో చిల్లర దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. కాగా అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు బంకు నిప్పపెట్టడంతో బంకుతో పాటుగా అందులోని సరుకులు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న నియోజకవర్గ సమన్వయకర్త మల్లికార్జుననాయుడు గ్రామానికి చేరుకుని వారిని పరామర్శించి అన్ని విధలా ఆదుకోవడంతో పాటుగా ఆర్థికంగా చేయూతనివ్వనున్నట్లు పేర్కొన్నారు. ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ సంఘటనాస్థలానికి చేరుకుని విచారించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కరువు మండలంగా ప్రకటించాలి

పెద్దమండ్యం నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : పెద్దమండ్యం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని తంబళ్లపల్లె నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడుమేకల చలపతి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో వర్షాబావ పరిస్థితుల వలన పంటలు ఎండి పోయాయని, చెరువుల్లో చుక్కనీరులేదని అందువల్ల ప్రభుత్వం వెంటనే పెద్దమండ్యం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం కరువు మండలంగా గుర్తించక పోతే ధర్నాలు చేస్తానని ఆయన హెచ్చరించారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు

మదనపల్లె అర్బన్, నవంబర్ 1:(ఆంధ్రజ్యోతి) కోర్టులో వెలసిన గంగమ్మకు మంగళవారం ఆలయకమిటీ పుష్పాలంకరణలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే పుష్పాలతో అలంకరణ చేసి అమ్మవారిని భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. మహిళలు అమ్మకు చీర, జాకెట్లు, పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు కార్యదర్శి మార్పూరి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్లు రంగస్వామినాయుడు, కరుణాకర్‌నాయుడు, మార్పూరి విక్కీ, మార్పూరి మహేష్, దేవేంద్ర, శ్రీనివాసులునాయుడు పర్యవేక్షించారు.

వేడుకగా దీపావళి సంబరాలు


ములకలచెరువులో టాపాసులు కాల్చుతున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 31:(ఆంధ్రజ్యోతి) మదనపల్లె పట్టణంలో దీపావళి పండుగ సంబరాలను ప్రజలు వేడుకగా నిర్వహించారు. బీకేపల్లెలోని ధాత్రి ఫౌండేషన్ నిర్వహ కురాలు డాక్టర్ స్వాతి ఆధ్వర్యంలో ఆనంద వృద్ధాశ్రమంలో స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా అందరితో కలిసి దీపాలు వెలిగించారు.

ములకలచెరువులో: మండలంలో దీపావళి పండగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో భారీగా బాణా సంచా పేల్చి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ములకలచెరువులో కదిరి రోడ్డులో ముస్లింలు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు.

బి.కొత్తకోటలో:నగరపంచాయతీ, మండలంలో దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉద్యోగాలతో పట్టణప్రాంతాలలో ఉంటున్న వారందరూ పల్లెలకు తరలి రావడంతో పల్లెలు కిటకిటలాడాయి.

విద్యార్థుల దీపావళి జోరు

మదనపల్లె టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ పురస్కరించుకుని మదనపల్లెలో విద్యార్థులు ఉత్సాహంగా దీపావళి నిర్వహించారు. స్థానిక శ్రీనివాస, జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల, శ్రీసిద్దార్థ, కృష్ణారెడ్డి సిద్దార్థ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు కళాశాలల్లో ధనలక్ష్మి పూజలు నిర్వహించారు.

మంత్రి లోకేశ్‌తో లోకేశ్ కొణిదెల

మదనపల్లె టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను తానా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, టీడీపీ ఎన్‌ఆర్‌ఐ కోఆర్డినేటర్ లోకేశ్ కొణెదల మర్యాదపూర్వకంగా కలిసారు. గురువారం లాస్‌వెగాస్‌లో ఐటీ సర్వ్ అలియెన్స్ సమావేశంలో మంత్రి లోకేశ్‌ను కలిసి మాట్లాడారు.

ఉచిత గ్యాస్ సిలిండర్లతో మహిళలకు చేయూత


లబ్ధిదారులు ఉచిత సిలిండర్ అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీతో మహిళలకు చేయూత లభిస్తోందని స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక టిప్పు సుల్తాన్ కాంప్లెక్స్‌లో మహిళల కోసం దీపం-2 పథకాన్ని జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చేసి ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నెరవేస్తున్నారని తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి డ్వాక్రా మహిళలకు బ్యాంకు లిం కేజ్ ద్వారా రూ. 5లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, మదనపల్లె తహసీల్దార్ ఖాజాబీ, టీడీపీ నాయకులు నాదేళ్ల విద్యాసాగర్, శివన్న, నాగూర్‌వలి, షంషీర్ కౌన్సిలర్ తులసిరామకృష్ణ, మాజీకౌన్సిలర్స్ రాధమ్మ, పులిమహాలక్ష్మీ, నీలకంఠ, డాన్స్‌రెడెప్ప, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, జనసేన నాయకులు శ్రీరామరామాంజనేయులు, దారం అనిత, నాయకులు జేసీబీ వేణు, గౌతమ్ స్కూల్ లక్ష్మీనారాయణ, బిల్డర్ రామకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

పాలకులం కాదు.. ప్రజా సేవకులం!

● ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం ● గంజాయిపై ఉక్కుపాదం
● దీపం-2 పథకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి


పీలేరు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభు త్వంలో భాగస్వామ్యులైన తాము పాలకులం కాదని.. ప్రజా సేవకులమని, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అందుకనే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తు న్నామని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన దీపం-2 పథకాన్ని శుక్రవారం ఆయన పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రారంభించి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు సిలిండర్లు ఉచి తంగా ఇస్తామని అనంతరం మహిళలకు గ్యాస్ సిలిండర్లు అందజేశారు. పీలేరు మండలంలో దాదాపు 27 వేల మందికి ప్రభుత్వం ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందజేయనుందన్నారు. గంజాయి విక్రయంలో ఎవరున్నా ఉపేక్షించవద్దని పోలీసుల ను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు భీమేశ్వర రావు, టీడీపీ నాయకులు అమరనాథరెడ్డి, కోటపల్లె బాబు, శ్రీకాంత్ రెడ్డి, పురం రామ్మూర్తి, మల్లెల రెడ్డిబాషా, నారే సతీశ్, లక్ష్మీకర, పోలిశెట్టి సురేంద్ర, భాస్కర రెడ్డి, పురం రెడ్డమ్మ, మల్లెల సాధన, రెడ్డిరాణి, స్వర్ణలత, షమ, రమాదేవి, సుబ్రదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి


ములకలచెరువులో ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఇండెన్ గ్యాస్ కార్యాలయం సమీపంలోని మైదానంలో శుక్రవారం నియోకవర్గంలోని ఆరు మండ లాల లబ్ధిదారులకు దీపం - 2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్న ఘటన సీఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. ఇప్పటికే పింఛన్ల హామీ అమలు చేసి దీపావళి పండగ సందర్భంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రా రంభించామన్నారు. కార్యక్రమంలో ఆరు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు ప్రదీప్, తపస్వీని, హరిప్రసాద్, శ్రీరాములునాయక్, అన్సారీ, సయ్యద్‌మహమ్మద్, హరినారాయణ, బీజేపీ నేత గోపాల్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, తంబళ్లపల్లె మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, నేతలు తులసీధర్‌నాయుడు, మొటుకు శివ, ఎండీ మస్తాన్, శ్రీనివాసులు, గంగాదేవి, భజంత్రి రామాంజులు, ఎర్రంరెడ్డి, కిట్టన్న, వేణుగోపాల్‌రెడ్డి, ఇండెన్ గ్యాస్ నిర్వాహకుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్

మదనపల్లె అర్బన్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి):మదనపల్లె మెడికల్ కళాశాలను ప్రైవేట్ పరం చేయాలనుకోవడం తగదని ప్రభుత్వమే నడపాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్య క్షుడు బందెల గౌతమ్‌కుమార్ డి మాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లెకు వచ్చిన మెడికల్ కళాశాలను వెనకకు పంపడం దారుణమన్నారు. మదనపల్లె ప్రభుత్వ మెడికల్ కళాశాల అంశంపై ప్రజా సంఘాలు, కులసంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి కార్యచరణ సిద్ధం చేసి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్ర మంలో బీఎస్పీ నాయకులు రమణ, ఉదయ్, శ్రీనివాసులు, లక్ష్మీపతి, గంగాధర్, శ్రీనాథ్, శివప్రసాద్, సంధ్యా, మహేష్, రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

రామసముద్రం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మండలంలో 6450లకు గాను సాయంత్రం 4.30వరకు 96శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో భానుప్రసాద్ తెలిపారు. గ్రామ సచివాలయ సిబ్బంది ఉదయం ఐదింటికి గ్రామాలకు చేరుకుని పింఛన్లు పంపిణీ ప్రారంభించడం వల్ల సత్ఫలితాలు వచ్చాయన్నారు. పెద్దకురప్పల్లె పంచాయతీలో తిరుమలరెడ్డిపల్లెలో జరిగిన పింఛన్లు పంపిణీలో ఎంపీడీవో పాల్గొని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సురేంద్రబాబు, మాజీ సర్పంచ్ రెడ్డిశేఖర్, ఏఎన్‌ఎం గీతారాణి, డిష్ కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో: మండలంలో శుక్రవారం మొదటి రోజు 96 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో భానుమూర్తి రావు తెలిపారు. మొత్తం 7017 మందికి పంపిణీ చేయాల్సి వుండగా 6776 పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు చెప్పారు. చీకటిపల్లె పంచాయతీలో వంద శాతం పంపిణీ పూర్తికాగా మేడికుర్తిలో 98 శాతం పంపిణీ జరిగినట్లు వివరించారు. అత్యల్పంగా పల్లవోలు పంచాయతీలో 91 శాతం మాత్రం పంపిణీ చేశారని పేర్కొన్నారు.

ఉత్సవం పోటీలలో మిట్స్ విద్యార్థుల ప్రతిభ

కురబలకోట, నవంబరు 1: మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయిలో నిర్వహించిన ఉత్సవం పోటీలలో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో ఎంబీఏ ఫైనలియర్‌కు చెందిన విద్యార్థులు రాఘవేంద్ర, పవన్‌కుమార్, గోవింద, లిఖితలు ప్రొద్దుటూరులోని రాజేశ్వరి కళాశాలలో జరిగిన పోటీలలో పాల్గొన్నారు. ప్రతి భ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూ టీవ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్, డీన్ శ్రీమంత్‌బసు, విభాగాధిపతి గీతాదేవీ అభినందించారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

బి.కొత్తకోట, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని బి.కొత్తకోట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని జ్యోతిసర్కిల్, దిగువబస్టాండులో ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణప్పలు మాట్లాడుతూ అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దుచేసి, 4లేబర్ కోడ్ లను తెచ్చి కార్మిక వర్గానికి తీరని ద్రోహం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మికులసంఘం నాయకులు సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి, ఆదినారాయణ, ఆంజనేయులు, షఫీ, ప్రభాకర, విమలమ్మ, మంజు, శంకర, అంజి తదితరులు పాల్గొన్నారు.